www.janasakthionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 46    సంచిక : 22    విజయవాడ    20-3-2014    పేజీలు : 8    వెల : రు 5.00

**మార్పును గమనించగలరు**

జనశక్తి వెబ్‌సైట్ అడ్రస్ www.janashaktionline.comకు బదులుగా www.janasakthionline.comగా మారింది. దయచేసి గమనించగలరు.

మార్చి 16 - ప్రథమ వర్ధంతి

రైతు-కూలీ పోరాట యోధుడు



కమ్యూనిస్టు విప్లవకారులనేత

## కామ్రేడ్ మానం రామారావుకు విప్లవజోహార్లు

**గుంటూరుజిల్లా** - బాపట్ల తాలూకా - నర్సాయపాలెం గ్రామంలో 1920లో జన్మించిన కామ్రేడ్ మానం రామారావు - నిబద్ధత గల కమ్యూనిస్టుగా, రైతుకూలీ పోరాట యోధునిగా, కమ్యూనిస్టు విప్లవకారునిగా, సిపిఐ(ఎం-ఎల్) నాయకునిగా బాధ్యతలు నిర్వర్తించి, 93 సం॥ల వృద్ధాప్యంలో విజయవాడలో 2013 మార్చి 16న అమరులయ్యారు. ప్రథమ వర్ధంతి సందర్భంగా కామ్రేడ్ మానం రామారావుకు సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి అరుణారుణ జోహార్లు చెబుతోంది.

కామ్రేడ్ మానం రామారావు(ఎమ్మార్) మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టి, యువకునిగా వున్నపుడు గ్రామంలో కమ్యూనిస్టు భావాలతో ఉత్తేజితులయ్యారు. తనతో సహా నిరక్ష్యరాస్యులైన యువజనుల విద్య, వికాసాల అభివృద్ధికి పార్టీ ఆధ్వర్యంలో రాత్రి పాఠశాలలు, వయోజన పాఠశాలలు నిర్వహించారు. గ్రామంలో యువకుల బృందాన్ని కూడగట్టి, వారి ద్వారా మొత్తం గ్రామాన్ని విజ్ఞానవంతం చేశారు. పీడితవర్గాలను చైతన్యవంతులను చేసి పెత్తందార్లకు వ్యతిరేకంగా సంఘటితం చేశారు; యువజన, పాలేర్ల సంఘాలను నిర్మించారు. నర్సాయపాలెం గ్రామాన్ని స్టాలిన్‌గ్రాడ్ అని కమ్యూనిస్టులు, కమ్యునిస్టేతరులు అనుకునేట్లుగా కమ్యూనిస్టు భావజాలంతో గ్రామ ప్రజలను సంఘటితపరిచారు.

బ్రిటిష్ వలసపాలకులు ఇనుము వాడకంపై నిషేధం విధించగా, వ్యవసాయానికి అవసరమైన బండిపట్టాలు; ప్రజలకు బట్టలు తదితర అవసరాల కోసం బ్రిటీష్ అధికార యంత్రాంగంపై ఆందోళనలకు నాయకత్వం వహించారు. కమ్యూనిస్టుపార్టీ పిలుపుమేరకు ఒక ఉద్యమంగా నడిచిన ఆహారోత్పత్తి పెంపుదలకు కృష్ణాకాలవల పూడికతీత పనులను యువకులందరితో కలసి నిర్వహించారు.

1947లో-తెలంగాణా రైతాంగపోరాటానికి సంఘీభావంగా ఆ ప్రాంత కార్యకర్తలకు అవసరమైన ఆర్ధిక, పాదార్ధిక సహకారాన్ని పోగుచేయటం; 'మా భూమి' తదితర భూస్వామ్య వ్యతిరేక నాటకాలు వేయించటం... దీక్షతో, ఒక ముఖ్య కర్తవ్యంగా చేపట్టి నిర్వహించారు. తెలంగాణా రైతాంగ పోరాటం సాగిస్తున్న మిలిటెంట్ దళాలకు ఆయుధ శిక్షణనిప్పించటంలోనూ; వారికి రక్షణ ఏర్పాట్లు చేయటంలోనూ పార్టీ నాయకత్వంలో మంచి కృషిచేశారు.

1952-54 కాలంలో వేలాది ఎకరాల రొంపేరు బంజరును పీడితకులాల, పేద ప్రజలకు పంపిణీకై దీర్ఘకాల ఉద్యమం సాగించి విజయం సాధించారు. 1979లో ప్రకాశంజిల్లాలో వరదబాధితులకు-ముఖ్యంగా జరుగుమిల్లి, టంగుటూరు మండలాల్లో సహాయ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. 1981లో కారంచేడులోనూ; 1983లో టంగుటూరులోనూ పొగాకురైతులపై కాల్పులను ఖండిస్తూ రైతులను కూడగట్టి ఆందోళన సాగించారు.

గ్రామ ఉమ్మడి చెరువులో దళితుల ప్రవేశాన్ని నిరోధిస్తున్న పెత్తందార్ల దౌర్జన్యాలను, దళితులను సమీకరించి ఆయన అడుగడుగునా ప్రతిఘటించారు.

గ్రామ పెత్తందార్లతో తీవ్రసంఘర్షణలనడుమే 1953లో పీడితప్రజల అండతో కామ్రేడ్ ఎమ్మార్ నర్సాయపాలెం గ్రామసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. దీనితో బెంబేలెత్తిన ఆ ప్రాంత పెత్తందారులు కాంగ్రెస్ నాయకుడు నీలం సంజీవరెడ్డికి మొరపెట్టుకుని పంచాయితీ రద్దు చేయించి, కామ్రేడ్ ఎమ్మార్‌ను సర్పంచి పదవి నుండి అర్ధాంతరంగా తొలగించినప్పటికీ, పట్టుదలతో ఆయన తన కార్యకలాపాలలో నిమగ్నమయ్యారు.

1969లో నాటి గుంటూరుజిల్లాలోని ఇంకొల్లు-భీమవరంలోనూ... 1985లో కారంచేడులోనూ... దళితులపై అగ్రకుల భూస్వామ్యవర్గాలు సాగించిన హత్యాకాండలపై కామ్రేడ్ ఎమ్మార్ తీవ్రంగా స్పందించారు. వెనువెంటనే ఆయా ప్రాంతాలకు వెళ్ళి వివరాలు సేకరించుకొచ్చి, దళితులపై హంతకదాడులను ఖండిస్తూ కరపత్రాలు ముద్రించి, భూస్వామ్య, పెత్తందార్ల దౌర్జన్యాలను, అగ్రకుల దురహంకారాన్ని వెల్లడిచేయటంతోపాటు, బాధిత దళితులకు సంఘీభావాన్ని కూడగట్టటంలోనూ, వారిని పోరాటంలోకి సమీకరించటంలోనూ కామ్రేడ్ ఎమ్మార్ విస్తృత కృషిచేశారు.

1942లో యువకునిగా కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం స్వీకరించిన కామ్రేడ్ ఎమ్మార్, 1946-47నాటికి బాపట్ల తాలూకా కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1953 నుండి సాగిన పార్టీ ఆంతరంగిక పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. సి.పి.ఎం ఏర్పడినపుడు 1964లో బాపట్ల తాలూకా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆపై సిపిఎం లోపల జరిగిన సంఘర్షణలో విప్లవ ప్రజాయుద్ధ పంథాను సమున్నతంగా ఎత్తిపట్టారు. అతి, మితవాదాలను; సెక్టేరియన్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. 1968లో గుంటూరుజిల్లా విప్లవ కమ్యూనిస్టు కమిటీ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. కామ్రేడ్ నాగిరెడ్డి విప్లవ రాజకీయాలపట్ల అచంచల విశ్వాసంతో, పార్టీ నిర్మాణంలో ఎదురైన పెడధోరణులన్నింటినీ ఎదుర్కొంటూ అమరులయ్యే నాటికి కామ్రేడ్ విశ్వం నాయకత్వంలోని సిపిఐ(ఎం-ఎల్) సీనియర్ నాయకునిగా వున్నారు.

1986లో ఏర్పడిన రైతుకూలీ పేదల సంఘం వ్యవస్థాపక అధ్యక్షునిగా కామ్రేడ్ ఎమ్మెస్‌తో కలిసి బాధ్యతలు పంచుకున్నారు.

**(తరువాయి 2వ పేజీలో)**

## రాష్ట్ర విభజనను ప్రజల విభజనగా చిత్రిస్తున్న పాలకవర్గ పార్టీల కుతంత్రాన్ని ఎండగట్టండి!

**ఎన్నికలు** సమీపించటంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతున్నది. ఎన్నడో జరపాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెసు ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చి, చివరకు కోర్టు జోక్యంతో ఇప్పుడు నిర్వహిస్తున్నది. దీనితో మునిసిపల్ ఎన్నికలు, జడ్పిటిసి, యంపిటిసి ఎన్నికలు, శాసనసభ, పార్లమెంటు ఎన్నికలు రెండు నెలల వ్యవధిలో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాష్ట్రంలో గద్దెనెక్కటంకోసం తీవ్రంగా పోటీ పడుతున్న ప్రధాన పాలకవర్గ పార్టీలకు (కాంగ్రెసు, టిడిపి, టిఆర్ఎస్, వైఎస్ఆర్‌సిపి) తోడు మరో రెండు కొత్తపార్టీలు (కిరణ్‌కుమార్‌రెడ్డి, పవన్‌కళ్యాణ్) పుట్టుకొచ్చాయి. ఇతర పార్టీల నుండి వచ్చేవారికి తలుపులు బార్లాతెరచి పెట్టి బిజెపి పెరగాలని ఆశపడుతున్నది.

రాష్ట్ర విభజన చుట్టూనే రాజకీయ ప్రచారమంతా సాగుతున్నది. తెలంగాణా రాష్ట్రాన్ని సాధించిన ఘనతను దక్కించుకోవటంకోసం టి.ఆర్.ఎస్, కాంగ్రెసులు తెలంగాణా ప్రాంతంలో తీవ్ర పోటీపడుతుండగా, తెలంగాణా సాధనలో నా పాత్రను మరవకండంటూ బిజెపి వేడుకుంటున్నది. ఆంధ్రప్రాంతంలో విభజన పాపాన్ని మూటగట్టుకున్నది నువ్వంటే నువ్వంటూ కాంగ్రెసు, టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లు పరస్పరం దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. మేమే సమైక్యాంధ్ర వీరులమంటూ బొంగ్రలు విరుచుకుతిరుగుతున్నాయి. కాగా బిజెపి తనవల్లే ఆంధ్రకు మంచి ప్యాకేజి వచ్చిందనీ, తాను అధికారంలోకి వస్తే మరింత మంచి ప్యాకేజి ఇస్తాననీ ఆశపెడుతున్నది.

ఈ పరిస్థితి పాలవవర్గ పార్టీల రాజకీయ దివాళాకోరుతనాన్ని బట్టబయలు చేస్తున్నది. భాషా ప్రయుక్త రాష్ట్రమని చెప్పుకుంటున్నా, అభివృద్ధిచెందాల్సిన జాతి ప్రాతిపదికగా ఏర్పడిన మొదటి రాష్ట్రాన్ని విభజించటంలో వీటికి ఒక సూత్రబద్ధవైఖరిలేదనీ, విభజనపట్ల ఈ పాలకవర్గ పార్టీలలో ఒక విధానమంటూ లేదనీ, ప్రాంతాల వారీగా నిట్టనిలువునా యివన్నీ చీలిపోవటమే తెలుపుతున్నది. కొత్తపార్టీ పెట్టిన కిరణ్‌కుమార్‌రెడ్డయితే తిరిగి రాష్ట్రాన్ని ఐక్యంచేసేది నేనేనంటూ వీరంగం వేస్తున్నాడు.

విభజన చట్టబద్ధమైన తర్వాత కూడా విభజన ఎందువల్ల చేయాల్సివచ్చిందో వివరించేందుకు వీరెవ్వరూ పూనుకోకపోగా, విభజననే కేంద్రంగా చేసుకుని ఇంతవరకూ పెంచుతూవచ్చిన ప్రాంతీయ వైమనస్యాలకే మళ్లీ ఆజ్యంపోసి అధికారానికెగబాకేందుకు ఈ పార్టీలన్నీ ఒకరిని మించి మరొకరు పోటీపడటం జుగుప్సాకరస్థాయికి చేరింది.

ఈ జుగుప్సకే పరిమితం కాకుండా లోతులకు వెళ్లి పరిశీలిస్తే, దోపిడీవర్గ ముఠాల మధ్య వైరుధ్యాలూ, కుమ్మక్కులు అర్ధమౌతాయి. ఈ పార్టీలన్నీ కలిసి ఎన్నికల సందర్భంగా జరగాల్సిన రాజకీయ చర్చను రాష్ట్రవిభజనకే పరిమితం చేశాయి. ప్రజలెదుర్కొంటున్న మౌలిక, తక్షణ సమస్యలపై చర్చ సాగకుండా చేస్తున్నాయి. విభజన తదనంతర సమస్యలకు కూడా మార్గాలు చూపకుండా ప్రాంతీయ వైమనస్యాలతో ప్రజల దృష్టిమళ్లించేందుకే పూనుకున్నాయి.

తెలంగాణా పునర్నిర్మాణమే నా కర్తవ్యమంటూ గంభీర వచనాలుతప్ప ఆ పునర్నిర్మాణ తీరును గూర్చి ఒక్క వివరం కూడా టిఆర్ఎస్ చెప్పదు. హైద్రాబాదాదు "అభివృద్ధి" అనే దాని ఫలితాలు తెలంగాణాకే దక్కాలంటూ ఎగసనమాటలు తప్ప ఆ "అభివృద్ధి" లోటు పాట్ల గూర్చి ఒక్కమాట మాట్లాడదు.

రెండు రాష్ట్రాలను అభివృద్ధిచేసేది నేనే అంటూ, ఇంతకు ముందు అభివృద్ధినంతా తన పార్టీయే చేసిందంటూ చంద్రబాబునాయుడు గొప్పలు చెప్పుకుంటున్నాడు. విభజిత రెండు రాష్ట్రాలలోని అన్ని ప్రాంతాలనూ సింగపూరు స్థాయికి అభివృద్ధి చేస్తానంటూ వాగ్దానాలు చేస్తున్నాడు.

కాంగ్రెసు పార్టీ, వైయస్ఆర్‌సీపి కూడా ఈ అభివృద్ధిపాటనే పాడుతున్నాయి. బిజెపి కూడా గుజరాత్‌స్థాయిలో రెండు రాష్ట్రాలను అభివృద్ధి చేస్తానంటున్నది.

ఈ పోటీ వెనుక దాగిన అసలు కుమ్మక్కు ఏమిటంటే దేశాన్నీ, దేశ సహజ, ఆర్ధిక వనరులను సామ్రాజ్యవాదులకు తాకట్టుపెట్టి దేశ ప్రజల శ్రమతో సృష్టించబడిన సంపదలను బడాబూర్జువాలకూ, విదేశీ పెట్టుబడుదారులకు కట్టబెట్టేందుకు అనుసరిస్తూ వస్తున్న విధానాలనే వీరందరూ అభివృద్ధిగా చిత్రిస్తున్నారు.

ప్రజల జీవన వాస్తవం కఠిన సత్యాన్ని తెలుపుతున్నది. ఈ పాలకవర్గ పార్టీలన్నీ అభివృద్ధిగా చెబుతున్నది గత 66 ఏళ్లుగా, ప్రత్యేకించి గత పాతికేళ్లుగా యువతను నిరుద్యోగ పెనుభూతపు కోరలనుండి తప్పించలేకపోయాయి. రైతాంగాన్ని భూములనుండి బేదఖలు చేశాయి. అప్పుల ఊబిలోకినెట్టి ఆత్మహత్యల పాలిట పడద్రోశాయి. గ్రామీణ పేదలకు ఉపాధి లేకుండాచేసి నగరాలకు వలసపోయి

**(తరువాయి 2వ పేజీలో)**

## నక్సల్బరీ ఉద్యమ నిర్మాత కా॥ కానుసన్యాల్‌కు విప్లవ జోహార్లు



## రైతుకూలీ పోరాట...(మొదటిపేజీ తరువాయి)

విప్లవసంఘాల విలీనం తర్వాత రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసాగారు.

కామ్రేడ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన పార్వతీపురం కుట్రకేసు డిఫెన్స్ కమిటీ నిధుల సేకరణకు కామ్రేడ్ ఎమ్మార్ కృషిచేశారు. ఎమర్జెన్సీ తదనంతరం రాష్ట్రవ్యాపితంగా – ప్రత్యేకించి గుంటూరుజిల్లాలో ప్రజలపై ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా పౌర, ప్రజాస్వామిక హక్కుల ఉద్యమ నిర్మాణ కృషిలో చురుకైన పాత్ర నిర్వహించారు.

'తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్' సంస్థాపకుల్లో ఒకరుగా కామ్రేడ్ ఎమ్మార్ కృషి సాగించారు. కామ్రేడ్ టి.ఎన్. విఖ్యాత రచన 'తాకట్టులో భారతదేశాన్ని' రాష్ట్రంలోని భిన్న రాజకీయశక్తుల మధ్యకు తీసుకెళ్ళటంలో కాలికి బలపం కట్టుకుని తిరిగారు; విస్తృతంగా కృషి చేశారు. విప్లవ కమ్యూనిస్టుల పక్షపత్రిక 'జనశక్తి'కి సంపాదకుని హోదాలో బాధ్యత వహించారు.

బి.టి.రణదివే కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శిగానున్న కాలంలో – 1948 ఫిబ్రవరి తర్వాత – రాష్ట్రవ్యాపితంగా పార్టీ కార్యకర్తలపై తీవ్రనిర్బంధం కొనసాగింది. ఈ క్రమంలో కామ్రేడ్ ఎమ్మార్, వసంతమ్మగారితో కలసి ఉద్యమనిర్మాణ అవసరాలరీత్యా రహస్యంగా వుండి పనిచేశారు. మారువేషాలతో పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకున్నా, ఎట్టకేలకు స్మశానంలో తలదాచుకున్న విషయాన్ని పసిగట్టి కామ్రేడ్ ఎమ్మార్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

సిపిఎంపై తీవ్రనిర్బంధం కొనసాగిన కాలంలో 1964 డిసెంబరు నుండి 16 మాసాల పాటు రహస్యంగా ప్రజల మధ్య వుండి పనిచేశారు. 1968లో, 1975 అత్యవసరపరిస్థితి కాలంలో పోలీసు నిర్బంధం కారణంగా రహస్యంగావుంటూనే ప్రజాకార్యకలాపాలు సాగించారు. 1972లో పోలీసులు కామ్రేడ్ ఎమ్మార్‌ను అరెస్టుచేసి ఎన్నివిధాల బెదిరించినా, తలొగ్గక నిబ్బరంగా నిలచి జామీనుపై విడుదలై విప్లవ కార్యక్రమాలలో నిమగ్నమయ్యారు.

1977 తదనంతర కాలంలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని ఖండిస్తూ, పీడిత ప్రజా ఉద్యమాలకు అండగా కామ్రేడ్ ఎమ్మార్ రాష్ట్ర వ్యాపితంగా పర్యటించారు.

భూస్వాముల నుండి తమ భూముల స్వాధీనం కోసం తూర్పుగోదావరిజిల్లా కొండమొదలు ఆదివాసులు సాగించిన పోరాటంపై 1982 నవంబరులో పోలీసులు కాల్పులు జరిపి కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యలను హత్య గావించారు. ప్రభుత్వ, పోలీసుల ఈ దుర్మార్గాన్ని ఎలుగెత్తి ఖండించటంలోనూ, యుద్ధ రంగంలోనున్న ప్రజల పోరాటధృతి సడలకుండా ధైర్యాన్ని అందించటంలోనూ కామ్రేడ్ ఎమ్మార్ నిర్వహించిన పాత్ర చిరస్మరణీయమైనది.

1997లో గుంటూరుజిల్లా – పల్నాడు ప్రాంతంలో కామ్రేడ్ విశ్వమోహనరెడ్డి నాయకత్వంలో భూమి సమస్యపై పెద్దఎత్తున కదిలిన పీడిత ప్రజానీకంపై ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం క్రూర నిర్బంధం ప్రయోగించి, కొండమోడులో నిర్మించుకున్న గుడిశలను కూల్చివేసి, ప్రజల్ని భీతావహుల్ని చేసిన సందర్భంలో... ఇతర నాయకులతో కలసి ప్రజలకు అండగా నిలిచి, పోలీసుల దాడులను నిశితంగా ఎండగట్టడంలో కామ్రేడ్ ఎమ్మార్ చూపిన తెగువ, ప్రజలకందించిన స్థైర్యం విలువైనవి.

గుంటూరుజిల్లాలో కామ్రేడ్ అంగడి చెన్నయ్య నాయకత్వంలోని 'ప్రజాపోరు' – నాటి సిపిఐ (ఎం–ఎల్–యూనిటీ ఇనీషియేటివ్)ల ఐక్యతా క్రమంలో–2001లో–పోలీసు ఉన్నతాధికారులు, పెత్తందారులు కామ్రేడ్ చెన్నయ్యపై తమ దుష్ప్రచారాలను తీవ్రంచేసి దిగజార్చాలని చేసిన దుష్టప్రయత్నాలను కా॥ఎమ్మార్ తిప్పికొట్టారు.

దాదాపు ఏడు దశాబ్దాల తన కమ్యూనిస్టు ఉద్యమ రాజకీయ జీవితంలో మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం పట్ల చెదరని విశ్వాసంతో, కమ్యూనిస్టు క్రమశిక్షణ, నిబద్ధతగల కామ్రేడ్‌గా ఎమ్మార్ కడదాకా కొనసాగారు. ఒక మధ్యతరగతి రైతుగా కమ్యూనిస్టుపార్టీలో ప్రవేశించి, సొంత ఆస్థి పెంచుకోకుండా, మిగుల్చుకోకుండా కమ్యూనిస్టు ఆదర్శాల కనుగుణంగా నిలిచారు. కాలు సహకరించని పరిస్థితుల్లో, మంచంమీద వుండి కూడా పార్టీకి సంబంధాలను, సహకారాన్ని సమీకరించటానికి తపనతో కృషిచేశారు. అనారోగ్యం, వృద్ధాప్యంతో ఉద్యమ కార్యకలాపాలలో పాల్గొనలేకున్నా, నిర్మాణ క్రమశిక్షణకు కట్టుబడినవానిగా, పద్ధతిగా తన జమా ఖర్చులను ఎప్పటికప్పుడు పార్టీ బాధ్యులకు అప్పగించేవారు. కమ్యూనిస్టుపార్టీ, రైతు–కూలీ నిర్మాణాలలోని కార్యకర్తలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన కా॥ఎమ్మార్‌కు సిపిఐ(ఎం–ఎల్) రాష్ట్రకమిటీ విప్లవజోహార్లర్పిస్తోంది. ✡

## రాష్ట్ర విభజనను...(మొదటిపేజీ తరువాయి)

దుర్భర జీవన పరిస్థితులకు లోనుచేశాయి. కార్మికులను నిరుద్యోగులను చేశాయి. పనిభద్రత లేకుండా చేశాయి. పనిప్రదేశాలలో ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. బడాబూర్జువాల దోపిడీకి ఎదురు చెప్పని బానిసల స్థాయికి కార్మికులను దిగజార్చాయి. కొన్ని నగరాలలో సాగుతున్న కళ్లు మిరుమిట్లు గొలిపే అభివృద్ధి కోట్లాది భారత శ్రమజీవుల రక్త స్వేదాలతో నిర్మించబడినదే. కానీ అభివృద్ధి ఫలాలు అన్నదాని ఫలితాలలో ఒక్కబొట్టు కూడా భారత శ్రామిక జనులకు చెందదు.

భారత ప్రజల జీవనాన్ని నానాటికీ దుర్భరం చేస్తూ, పుంజీడు మంది దోపిడీదారుల ఆస్తులను ఇబ్బడిముబ్బడిగా పెంచుతున్న ఈ విధానాలనే "అభివృద్ధి"గా చిత్రిస్తున్నారు.

ఈ పార్టీల పోటీ అంతా అభివృద్ధి జపంలోనే! దోపిడీ వర్గాల లాభార్జనా కాంక్షలను తీర్చటంలో నేను నేర్పరినంటే, కాదు నేనంటూ పోటీపడుతున్నాయి. ఈ అభివృద్ధి మంత్రజపంతో దోపిడీ వర్గాలకు విశ్వసనీయ సేవకులమంటూ నమ్మబలుకుతున్నాయి.

ఈ పోటీ అసలు స్వభావాన్ని కప్పిపుచ్చుకునేందుకే అభివృద్ధిఅంటే ప్రజల అభివృద్ధేఅని వంచన చేస్తున్నాయి. వారి అభివృద్ధిలోని దోపిడీ వర్గాల అనుకూలతను ప్రజలు ప్రశ్నించకుండా చేయటానికి "సామాజిక న్యాయ"మంటూ మంత్రాన్ని రంగంమీదకు తెచ్చాయి. ఒకరు దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానంటే మరొకరు వెనుకబడిన కులాలకు ముఖ్యమంత్రి పదవి యిస్తానంటున్నారు. ఆవిధంగా కుల సమస్యతో ప్రజలను చీల్చడానికి పూనుకున్నాయి. బిజెపి మరో అడుగు ముందుకువేసి మూడవతరం వారికి రిజర్వేషన్లు రద్దుచేస్తానంటూ ప్రకటించి, దళితులను చీల్చడానికి వర్గీకరణ సమస్యను మరోరూపంలో ముందుకు తెచ్చింది.

ఇది రాష్ట్రంలోనూ, దేశంలోనూ పాలకవర్గ పార్టీలు కలిసి ఆడుతున్న నాటకం. భ్రమాజనిత నినాదాలతో ప్రజలను వంచించి తమ చుట్టూ త్రిప్పుకోవటం; కుల, మత, ప్రాంతీయ తత్వాలను రెచ్చగొట్టి ప్రజలను చీల్చడం; తద్వారా ప్రజలెదుర్కొంటున్న ఏ సమస్యనూ చర్చలోకి కూడా రాకుండా చేయటం; డబ్బు, సారాలను వరదలా ముంచెత్తి ప్రజలకు ఊపిరాడకుండా చేయటం పాలకవర్గ పార్టీలన్నీ కలిసికట్టుగా సాగిస్తున్న నాటకం.

ఈ నాటకం తెరవెనుక సాగుతున్నది మాత్రం విదేశీ అధిపతుల, బడాబూర్జువాల, బడా భూస్వాముల దోపిడీలకు రక్షణ కల్పించటమే.

ప్రజలముందు ప్రదర్శిస్తున్న పోటీ అంతా ఈ దోపిడీ వర్గాలకు ఎవరెంత నమ్మకంగా సేవ చేయగలమన్నది నిరూపించుకోవటానికే.

ఈ విధమైన ప్రస్తుత పరిస్థితుల్లో తమ వ్యతిరేకతను వ్యక్తం చేసేందుకు ఈ కర్తవ్యాలు చేబూనాలని ప్రజలకు సిపిఐ(ఎం–ఎల్) పిలుపునిస్తోంది.

**(1) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి దేశాన్ని అమ్మివేసే శక్తులను, ప్రజల ప్రజాస్వామిక ఉద్యమాన్ని అణచివేసే శక్తులను ఎన్నుకొనేలా ప్రజలను నెడుతున్న ఈ వ్యవస్థకు –**

**(2) సామ్రాజ్యవాదానికి, అప్రజాస్వామిక విధానాలకులోబడిన పాలకపార్టీల కూటముల నిజరూపాలను మరుగుపరిచేలా మలచిన ఎన్నికల వ్యవస్థకు వ్యతిరేకంగా – పోరాడాలి**

ఈ ఎన్నికల సందర్భంగా ప్రజలు సంఘటితమై ప్రజాపోరాటాలను అభివృద్ధి చేసేందుకు తమకు తాముగా సంఘటితపడాలి.

**(1) సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశాధికార పెట్టుబడిదారుల, ఫ్యూడల్ భూస్వాముల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వాన్ని వాస్తవిక అర్ధంలో స్వతంత్రమైనదిగా, ప్రజాస్వామికమైనదిగా స్వావలంబనమైనదిగా మార్చేందుకు–**

**(2) ఈ ప్రభుత్వంలో పాలన సాగించేందుకు వాస్తవ ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ఎన్నికల వ్యవస్థను అభివృద్ధి చేసుకునేందుకు–పోరాడాలని సిపిఐ(ఎం–ఎల్) పిలుపునిస్తోంది.** ✡

## వివిధ దేశాలలో...(6పేజీ తరువాయి)

### మెక్సికో

2013 సెప్టెంబర్ 5న పదుల వేల సంఖ్యలో ఉపాధ్యాయులు మెక్సికో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. విద్యారంగంలో సంస్కరణలను ప్రవేశపెడుతూ కాంగ్రెస్ చట్టం చేయటాన్ని వీరు నిరసించారు. దేశ వ్యాపితంగా దీనిపై అసంతృప్తి అలుముకుంది. అన్ని సామాజిక వర్గాలను ఈ సంస్కరణలు నష్టపరుస్తున్నాయి. ఉపాధ్యాయుల ప్రతిభ నిర్ణయించడానికి పరీక్షలు నిర్వహించాలని ఈ చట్టం నిర్దేశిస్తున్నది.

మెక్సికోలోని మెబ్‌యోకాన్ రాష్ట్రంలో ప్రాథమికస్థాయి ఉపాధ్యాయులు నవంబర్ 27న తమ 40 రోజుల సమ్మెను విరమించారు. అదే సమయంలో అక్టోబరు 16న తాము ఆక్రమించుకున్న విద్యా సచివాలయాన్ని ఖాళీచేశారు. విద్యా విషయకమైన సంస్కరణలను వీరంతా వ్యతిరేకిస్తున్నారు. వీరి జీవన ప్రమాణాలకు, మౌలిక హక్కులకు ఈ సంస్కరణలు గొడ్డలిపెట్టుగానున్నాయి. మూల్యాంకన విధానాన్ని ఈ సంస్కరణలు అన్యాయమైన పద్ధతిలో ఉపాధ్యాయులపై రుద్దుతున్నాయి.

మెక్సికోలోని యుకాటన్ రాష్ట్రంలో నేషనల్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్ కాలేజీలోని 5 ప్రాంగణాలకు చెందిన విద్యావేత్తలందరూ డిసెంబర్‌లో నిరవధిక సమ్మె చేపట్టారు. తమకు వాగ్దానం చేసిన 6.4 మిలియన్ పెసోల సౌకర్యాలను డిమాండ్ చేస్తూ వారు ఆందోళన చేపట్టారు.

### బ్రెజిల్

2013 సెప్టెంబర్ 9న వేలాదిమంది ఉపాధ్యాయులు తమ వేతనాల పెంపును డిమాండ్‌చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. అక్టోబర్ 8న వేలాదిమంది రియో డి జనేరియాలో ప్రదర్శన నిర్వహించి ఉపాధ్యాయులకు మద్దతునిచ్చారు. వేతనాల పెంపు డిమాండ్‌తోపాటు, సరైన పని పరిస్థితులు కల్పించాలనే డిమాండ్‌లను వీరు సమర్ధించారు.

### ఆస్ట్రేలియా

మెల్‌బోర్న్‌లో శిక్షణలోవున్న ఉపాధ్యాయులు మరియు ఇతర విద్యాసంస్థలలోనున్న ఉపాధ్యాయులు 2013 నవంబర్ 18 నుండి సమ్మె నిర్వహించారు. నాలుగు సంవత్సరాల కాలంలో వాస్తవికంగా తమ వేతనాలలో కోతలను విధించే విధంగా నూతన ఒప్పందంలోని వివాదంతో ఆయా కేంద్రాలలో వీరు పికెటింగ్ నిర్వహించారు. ✡

## ప్రజల ఆందోళనతో ఆగిన మద్యం అమ్మకాలు

**ఉన్నవ, 12-2-2014 :**

గుంటూరుజిల్లా ఉన్నవ గ్రామంలో మద్యం అమ్మకాలను నిలిపివేయాలని, మద్యంషాపులను ఎత్తివేయాలని డిమాండ్‌చేస్తూ స్థానిక యువకులు, గ్రామ పెద్దలు జనవరి 12, 13 తేదీలలో నిరాహార దీక్షలు చేశారు. గత కొంతకాలంగా జరుగుతూవస్తున్న ఈ ప్రచార, ఆందోళనల ఫలితంగా 'గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిపివేయాల'ని గ్రామ పంచాయితీ తీర్మానించింది. ప్రస్తుతం ఈ గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిపివేశారు.

ఉన్నవ గ్రామంలో ప్రధానంగా యువత చొరవతో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఎన్‌వైయస్ జిల్లాకమిటి స్పందించి, ఈ గ్రామం వెళ్ళి వారికి సంఘీభావం తెలిపింది. అందరూ ఐక్యంగా, నిరంతరం అప్రమత్తంగా వుంటేనే మద్యం అమ్మకాలను, వినియోగాన్ని అడ్డుకోగలమని వివరించే కరపత్రాలతో జనవరి 18వ తేదీన గ్రామంలోని ఇంటింటికి ప్రచారం నిర్వహించింది. ఎన్‌వైయస్ జిల్లా కార్యదర్శి కా॥ కె. లక్ష్మణ్ ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఏటా మద్యంపై వచ్చే ఆదాయాన్ని వదులుకుంటే, ప్రజా సంక్షేమ పథకాలను కొనసాగించలేమని పలికే ఈ ప్రభుత్వాలు, మద్యం వ్యాపారంద్వారా గడించే వేల కోట్ల రూ॥ ఆదాయాన్ని ఆ సంక్షేమ పథకాలకు కూడా వెచ్చించకుండా ప్రజలను మోసగిస్తున్నాయన్నారు. ఆరుగాలం శ్రమించే రైతులను, కార్మికులను, కష్టజీవులందర్నీ మద్యం దోపిడీతో కొల్లగొడుతూ వారి ఇళ్ళూ, వళ్ళూ గుల్లచేస్తున్నారని, పర్యవసానంగా ఈ కుటుంబాలలో మహిళల కష్టాలు చెప్పనలవికాకుండా వున్నాయంటూ, ప్రజలంతా అప్రమత్తంగా ఇదే కట్టుబాటుపై వుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఎన్‌వైయస్ నాయకులు కా॥ మల్లి, శంకర్ తదితరులు పాల్గొన్నారు. ✡

## దశాబ్దాలుగా నివాసముంటున్న పేదలకు పట్టాలివ్వాలని ఆందోళన

**బందరు, 10-2-14 :**

బందరులోని భాస్కరపురం సబ్ డ్రైయినేజి ప్రక్కనున్న ప్రభుత్వ భూమిలో 25 సం॥లుగా ఇళ్లు నిర్మించుకొని దాదాపు 36 కుటుంబాల పేదలు నివసిస్తున్నారు. తమకు పట్టాలివ్వాలని మరోమారు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ 10-2-14న బందరు మండల తహసిలుదారు కార్యాలయం వద్ద రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె.జగన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపన్నుల ప్రయోజనాలను కాపాడుతూ, పెద్దఎత్తున భూములను వారికి కట్టబెడ్తున్న ప్రభుత్వం, దశాబ్దాలుగా నివాసముంటున్న పేదలకు చారెడు భూమికి పట్టాలివ్వకుండా ఉద్దేశపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఇళ్ళస్థలాలపై హక్కు సాధించుకునేంతవరకూ పోరాటం సాగించాలని గుడిశెవాసులకు పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం మండల తహసిలుదారుకు మెమోరాండం అందచేశారు. ఏఐఎఫ్‌టియు(న్యూ), స్త్రీ విముక్తి సంఘటనల నాయకులు నిరుపేదల ఆందోళనకు సంఘీభావంతెలుపుతూ ఈ ధర్నాలో పాల్గొన్నారు. ✡






# "అత్యధిక శాతం ఉక్రెయిన్ ప్రజలు దేశ విభజననుగానీ అంతర్యుద్ధాన్నిగానీ కోరుకోవటం లేదు"

**జీన్ మేరీ షావియర్**

**ప్రశ్న : ఉక్రెయిన్ ప్రజలు, ప్రత్యేకించి కార్మికులు, రైతాంగం, నిరుద్యోగులు, ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలేమిటి?**

1991లో సోవియట్‌యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత ఉక్రెయిన్ జనాభా 5.14 కోట్ల నుండి 4.5 కోట్లకు తగ్గిపోయింది. అప్పటికున్న (ఉచిత) ఆరోగ్య సేవలన్నింటినీ రద్దుచేయటంతో జననాలరేటు తగ్గుదల, మరణాలరేటు పెరుగుదల వల్ల జనాభా తగ్గిందని వివరిస్తున్నారు.

ఇతర దేశాలకు వలస పోవటం పెద్దస్థాయిలో వుంది. ప్రస్తుతం 66 లక్షలమంది ఇతర దేశాలలో వుంటున్నారు. ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని ప్రజలు ఎక్కువగా రష్యాకు వలసవెళ్ళారు. అక్కడ వేతనాలు కొంత ఎక్కువగా వుండటం కారణం. కాగా దేశ పశ్చిమప్రాంత ప్రజలు పశ్చిమ యూరపు దేశాలకు వలసపోవటంపై మక్కువచూపుతున్నారు. ప్రధానంగా నిర్మాణరంగంలో పనిచేస్తున్నారు. వారు స్వదేశానికి పంపుతున్న డబ్బు ఏడాదికి మూడు వందల కోట్ల డాలర్లు.

ఉక్రెయిన్‌లో అధికారిక లెక్కల ప్రకారం నిరుద్యోగం 8శాతం. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి శాతం 25. అయితే అనధికార అంచనాలు ఇంతకన్నా చాలా ఎక్కువగా వున్నాయి. 80శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువనున్నారని అంచనాలు తెలుపుతున్నాయి.

సగటు వేతనం నెలకు 322డాలర్లుగా వుంది. యూరపు దేశాలన్నింటికన్నా ఇది తక్కువ. పశ్చిమ ఉక్రెయిన్‌లోని గ్రామ ప్రాంతాలలో దారిద్ర్యం ఎక్కువగా వుంది. నిరుద్యోగ భృతి వంటి సౌకర్యాలు నామమాత్రంగానే ఉన్నాయి.

యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకున్న తర్వాత ఈ సమస్యలన్నీ మరింత తీవ్రమయ్యాయి. ఈ ఒప్పందం ప్రకారం అంతర్జాతీయ ద్రవ్యనిధి సూచించిన చర్యలు అమలుజరిపారు. దేశ తూర్పు ప్రాంతంలో పరిశ్రమల మూసివేత, లేదా వాటిని బహుళజాతి కంపెనీలకు అమ్మివేత వీటిలో ముఖ్యమైనవి.

సారవంత భూములు, వ్యవసాయానికి సంబంధించి స్థానిక వ్యవసాయ ఉత్పత్తిని నాశనం చేసేవైపుగా పరిణామాలున్నాయి. సమిష్టి క్షేత్రాలు రద్దయి, దాని భూములు పొందిన చిన్నరైతాంగాన్ని తొలగించి చిన్న కంపెనీలు భూమిని స్వాధీనం చేసుకుంటుండగా, విదేశీ వ్యవసాయ కంపెనీలు వాటి నుండి భూమిని లాగివేసుకుంటున్నాయి. సారవంత భూములను విదేశీ కంపెనీలు కొనివేస్తున్నాయి. బ్రిటన్‌కు చెందిన లాండ్ కామ్ అన్న కంపెనీ లక్ష హెక్టార్లను కొనుగోలు చేసింది. రష్యాకు చెందిన రినై జాన్స్ అన్న ద్రవ్యనిధుల కంపెనీ 3 లక్షల ఎకరాలు కొనుగోలు చేసింది. కొన్ని పరిశ్రమలు, చమురు సహజవాయువు, పైపులైన్సు, పంట భూములు, నైపుణ్య శ్రామికులు బహుళజాతి కంపెనీలకు లాభాల వనరుగా మారాయి.

**ప్రశ్న : యూరోపియన్ యూనియన్‌తో సంబంధాల మెరుగుదల వల్ల అనుకూలత, ప్రతికూలత లేమిటి?**



దేశాల మధ్య ఆటంకాలులేని ప్రయాణం, మంచి వేతనాలు, మెరుగైన సౌకర్యాలు, సుఖవంతమైన జీవితం భ్రమలతో ఉక్రేనియన్ యువత కలలుగంటున్నారు. అయితే నిజమేమి టంటే ఉక్రెయిన్‌ను ఇయులో చేర్చుకోరు. కనుక ఉక్రెయిన్ దేశీయులు యూరపు దేశాలకు వెళ్ళి ఉపాధి పొందటం సాధ్యం కాదు.

స్వేచ్ఛా వాణిజ్యాన్ని పెంచటం అంటే పశ్చిమ దేశాల ఉత్పత్తులను పెద్దయెత్తున ఉక్రెయిన్ దిగుమతి చేసుకోవటం, ఉక్రెయిన్ ఎగుమతి చేయగల సరుకులపై నాణ్యతా ప్రమాణాల పేరిట ఆంక్షలుపెట్టడం అన్నదే సాగుతున్నది.

మరోవైపున ఉక్రెయిన్‌కు ఇయుతో ఒప్పందం కుదిరితే, రష్యాలోకి ఉక్రెయిన్ ఎగుమతులను ఆపివేస్తానని రష్యా బెదిరిస్తున్నది. ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తున్న చమురు ధర తగ్గిస్తానని ఆశ పెడుతున్నది. అలాగే రష్యా, బైలారస్‌తో కస్టమ్స్ యూనియన్ ఏర్పాటు చేస్తానని ప్రతిపాదిస్తున్నది. ఇది కూడా రష్యా ఆధిపత్యాన్ని పెంచేదే.

**ప్రశ్న : ఉక్రెయిన్‌లో వున్న ప్రాంతీయ అసమానతలను వివరించండి?**

ఉక్రెయిన్ ఒకేజాతి రాజ్యం కాదు. భిన్నత్వం వుంది. ప్రాంతాల మధ్య వైరుధ్యాలున్నాయి. విభిన్న చరిత్ర వుంది.

1917 విప్లవం, అంతర్యుద్ధం తర్వాత మొదటిసారిగా ఉక్రెయిన్ ఉనికిలోకి వచ్చింది. 1922లో సోవియటు యూనియన్‌లో చేరింది. పోలాండ్ ఆక్రమించిన పశ్చిమ ప్రాంతం 1939లో ఉక్రెయిన్‌లో కలిసింది. ఆ తర్వాత 1954లో క్రిమియాను ఉక్రెయిన్‌లో కలిపారు.

ఉక్రెయిన్ తూర్పు ప్రాంతం ఎక్కువ పారిశ్రామీకరణ చెందింది. కార్మికులు ఎక్కువ. రష్యా భాష మాట్లాడేవారెక్కువ. కాగా పశ్చిమ ప్రాంతం ప్రధానం గ్రామీణ ఆర్థికం. రైతాంగం ఎక్కువ. ఉక్రెయిన్ భాష ఎక్కువ వాడుకలో వుంది.

తూర్పు ప్రాంతం ఛాందస క్రిస్టియన్ మత ప్రాబల్యంలో వుంది. 1991 తర్వాత కీవ్ పితృస్వామిక వ్యవస్థతో ఎక్కువ ముడివేసుకుంది. పశ్చిమ ప్రాంతంలో కాథలిక్ చర్చి ప్రాబల్యంలో వుంది. ఇది జర్మనీతో ఎక్కువ సంబంధాలు కలిగి వుండి పోలిష్ చర్చితో ఘర్షణపడుతుంటుంది.

యుక్రెయిన్ రాజధాని కీవ్ తూర్పు, పశ్చిమాల మిశ్రమంగా వుంది. కీవ్‌లో ప్రధానంగా రష్యన్‌భాష వుంది. ఇక్కడి పాలకులు ప్రతిపక్షానికి అనుకూలురు. రష్యాలోని అతి ఉదారవాదులతో సంబంధాలు కలిగివున్నారు.

కనుక చారిత్రికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా తూర్పు, పశ్చిమాలుగా ఉక్రెయిన్ విభజితమై వుంది. అంతర్యుద్ధాన్ని ప్రేరేపించేందుకు బయటి శక్తులు ప్రాంతాల మధ్య విభేదాలను రెచ్చగొడుతున్నాయి.

పశ్చిమ దేశాలు, ఇక్కడ వారి తైనాతీలు ఉక్రెయిన్‌ను విభజనవైపు నెడుతున్నారు. రష్యా చూస్తూ వూరుకోదు. ఇరువురూ చేరి కొంత ప్రాంతాన్ని పంచుకుంటారు.

యూరోపు దేశాలపట్ల అనుకూలత నెంచుకోవటమంటే సైనిక పర్యవసానాలుంటాయన్న అంశాన్ని ఎవరూ మరువరాదు. ఇయు వెనకాలే నాటో ప్రవేశిస్తుంది. వెంటనే క్రిమియాలోని సెబాస్టపోల్‌లో వున్న రష్యా సైనిక స్థావరం ప్రశ్న ముందుకొస్తుంది. ఈ స్థావరం రష్యాకు సైనిక వ్యూహరీత్యా కీలకమైనది. అమెరికా ఇక్కడ సైనిక స్థావరం ఏర్పాటు చెయ్యటాన్ని మాస్కో అంగీకరి స్తుందని ఊహించలేము.

**ప్రశ్న : ప్రస్తుత పరిణామాలలో ప్రధాన పాత్రధారులెవరు? కీవ్‌లో ప్రదర్శనలు చేస్తున్నవారెవరు? వారిని ఒకటిగా చేసిందేమిటి? ఉక్రెయిన్ రాజ్యాధికార స్వభావమేమిటి?**

ఉక్రెయిన్ సోషలిస్టు సంపదను రష్యా, పశ్చిమ దేశాల అనుకూలుర మధ్య విభజించుకుని ద్రవ్య, పారిశ్రామిక బడా గ్రూపులు లబ్ధిపొందాయి.

విక్టర్ యనుకోవిచ్, అతని పార్టీ తూర్పు, దక్షిణ ఉక్రెయిన్‌లోని (దోపిడీ వర్గాలకు) గ్రూపులకు ప్రతినిధిగా వుంది. ఈ పార్టీ 2013 అధ్యక్ష, పార్లమెంటరీ ఎన్నికల్లో గెలుపొందింది. దీనికి పశ్చిమ ప్రాంతంలో కూడా కొన్ని బలమైన కేంద్రాలున్నాయి.

ఇయు, నాటోలు వినియోగించుకోవాలని చూస్తున్న ప్రస్తుత సంక్షోభపరిస్థితికి ప్రధాన కారణం ప్రస్తుత ప్రభుత్వమే. మొత్తం దేశాన్ని రక్షిస్తున్నానని అది చెప్పుకుంటున్నప్పటికీ, అది బడా బూర్జువా వర్గంలోని ఒక గ్రూపు కొమ్ముకాస్తున్నది. అవినీతి, మాఫియా సంస్కృతిని ఇది విస్తరింపచేసింది.

దీనిని వ్యతిరేకించే - ప్రధానంగా పశ్చిమ ప్రాంతానికి చెందిన - మూడు రాజకీయ సంస్థలున్నాయి.

మొదటిది : అరెసినీ లాత్సేనిక్ నాయకత్వం లోని పితృభూమి పార్టీ. తర్వాతది సంస్కరణల ఐక్య ప్రజాస్వామిక పార్టీ (ఉడార్ పార్టీ). దీని నాయకుడు విటాలి క్లిచ్‌కో. ఇతనికి జర్మనీ ఛాన్సెలర్ మెర్కెల్ పూర్తి మద్దతునిస్తున్నాడు. ఈ పార్టీ కార్యకర్తలకు జర్మనీలోని అడెనూర్ ఫౌండేషన్ శిక్షణ నిచ్చింది. మూడవది : నయా ఫాసిస్టు పార్టీ స్వొబోదా. దీని నాయకుడు ఒలెగ్ టియాగ్నిబొక్. ఉక్రేనియన్ నేషలిస్టు సంస్థ అన్న 1939లో ముస్సోలినీ ప్రారంభించిన సంస్థతో ప్రత్యక్ష సంబంధాలను కలిగివుంది. హిట్లర్ కాలం నుండి ఫాసిస్టు శక్తులు జాతీయోన్మాద నినాదాలిస్తుండేవి. ఇవి ఎన్ని గ్రూపులుగా వున్నా కమ్యూనిస్టుల, యూదుల ఊచకోతను ఉమ్మడి లక్ష్యంగా కలిగివుండేవి.

ఈ ఫాసిస్టులు ఉక్రెయిన్‌లో యూరోపియన్ భాగాన్ని సమర్ధించి రష్యావైపునున్న ఆసియాభాగాన్ని వ్యతిరేకించేవారుగా వున్నారు. యుద్ధకాలంలో వీరు అనేక దురాగతాలు సాగించారు. సోవియట్ యూనియన్ వారిని అణచివేసింది.

2004లో "నారింజ విప్లవ"మనేదాని తర్వాత స్వొబొదాపార్టీ బలాన్ని పుంజుకుంది. పశ్చిమ ప్రాంతంలో 20నుండి 30శాతం ఓట్లు పొందింది. ఇది నయా నాజీ గ్రూపుల ఏర్పాటును ప్రోత్సహించింది.

పశ్చిమదేశాలు మద్దతు యిస్తున్న ఈ మూడు పార్టీలు ప్రభుత్వాన్ని, అధ్యక్షుడినీ తొలగించాలని గత రెండు నెలలుగా డిమాండు చేస్తున్నాయి. మళ్ళీ ఎన్నికలు జరపాలంటున్నాయి. స్వొబోదా పార్టీ మరో అడుగువేసి స్థానికంగా తిరుగుబాటు చేసేందుకు పూనుకుంది. టెర్రర్ ఎత్తుగడలతో అధికారాన్ని కైవశం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నది. తనకు పైచేయి వచ్చిన ప్రాంతంలో అధికారంలో వున్న పార్టీని నిషేధిస్తున్నది.

ఉక్రెయిన్ కమ్యూనిస్టు పార్టీ సంయమనం పాటించమని ప్రజలకు విజ్ఞప్తిచేస్తున్నది. ఇయుతో ఒప్పందమా లేక రష్యాతో ఒప్పందమా అన్న అంశంపై రిఫరెండం జరపాలని కోరుతూ 30లక్షల సంతకాలు సేకరించింది. ప్రజల సమస్యలపై పార్టీ కేంద్రీకరిస్తున్నది. అన్ని పార్టీలలోకి దీనిదే అత్యంత ప్రజాస్వామిక వైఖరిగా వుంది. అయితే దీనిప్రభావం తూర్పు, దక్షిణ ప్రాంతంలో పరిమితంగా వుంది.

**ప్రశ్న : ప్రస్తుత ఘర్షణలో అగ్రరాజ్యాల (అమెరికా, ఇయు, రష్యా) పాత్ర ఏమిటి? వారికేం కావాలి?**

అమెరికా ప్రముఖ వ్యూహకర్త బ్రెజిజిన్‌స్కీ 1990లో ఒక వ్యూహాన్ని రూపొందించాడు. దీనినే అమెరికా అమలుచేసింది. యురేసియాలో అమెరికా ఆధిపత్యస్థాపన వ్యూహమిది. దీనిలో ఉక్రెయిన్ కీలకమైంది. యురేసియాను మధ్య ఆసియాను రెండుగా విభజించాలి. ఈ వ్యూహం అమలుతోనే "నారింజ విప్లవం" వచ్చింది. అమెరికాఫౌండేషన్‌లు తమ కబంధ హస్తాలతో ఉక్రెయిన్‌ను బిగించాయి. ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించటం పేరిట ఇదంతా సాగింది.

2013లో వ్యూహం మారింది. అమెరికా రాజకీయ నాయకుల తోడ్పాటుతో జర్మనీ, ఇయు ముందుకొచ్చాయి. ఉక్రెయిన్ ఇయు వైపు మొగ్గేవిధంగా చేయటం వారి లక్ష్యం. దీనికోసం అవి అత్యంత బాధ్యతారహితంగా ప్రజలను రెచ్చగొట్టాయి.

అయితే తూర్పు, పశ్చిమాలుగా ఉక్రెయిన్‌ను విభజించకుండా ఈ లక్ష్యం సాధ్యంకాదు. క్రిమియాను తిరిగి రష్యాకివ్వాలి. మేము ఫాసిస్టులకు లొంగేది లేదని క్రిమియా పార్లమెంటుకు తెగేసి చెప్పింది.

ఏమైనప్పటికీ, ఉక్రెయిన్‌లోని అత్యధిక ప్రజానీకం మరో అంతర్యుద్ధాన్ని కోరుకోవటంలేదు. ఈ దేశం రెండు ముక్కలవటాన్ని కోరుకోవటంలేదు. ఉక్రెయిన్ సమాజం పునర్నిర్మించబడాలని వారు కోరుకుంటున్నారన్నది నిస్సందేహం. ✡


**ఏఐఎఫ్‌టియు(న్యూ), ఏఐకెఎమ్‌కెఎస్ అఖిలభారత రైతు, కూలీ, కార్మిక సమ్మేళనం సావనీర్ (హిందీ)**



వెల : రూ. 30/-
కాపీలకు :
**మైత్రీ బుక్ హౌస్**
28-9-1, జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2




**THE VOICE OF INDIAN REVOLUTION**
**A CPI(M-L) TRIBUTE TO COMRADE KANU SANYAL**
Price : Rs. 150/-
For Copies :
**Mythry Book House**
Jaleel street, Karl Marx Road,
VIJAYAWADA - 2

# చైనా సాంస్కృతిక విప్లవంపై ప్రతిస్పందనలు

## కావోతో యాన్‌హైరాంగ్ ముఖాముఖి

కావో జెంగ్లూ సమకాలీన చైనా వాస్తవ కథారచయిత. అతని కథలు "అక్కడ" "Naer" ఇది ప్రభుత్వ యాజమాన్యంలోని పారిశ్రామిక సంస్థలో సంస్థాగత సంస్కరణలు అమలుచేయబడుతున్న క్రమంలో ఆ సంస్థలో పనిచేస్తున్న జాతీయ కేడరు యొక్క విషాదకర అనుభవాలు) "Nihong" (నియాన్– పనినుండి తొలగించబడిన ఒక మహిళ యొక్క చావు బ్రతుకుల పోరాటం) సంస్కరణల కాలంలో చైనా కార్మికుల అవస్థలను ఎత్తిచూపాయి. అతని నవల "Wen Cangmang (Asking the Boundless- మావో పద్యంలోని ఒక పంక్తి I ask, on this boundless land, which rules over man's destiny- హద్దులు లేని ఈ భూమ్మీద మనిషి గమ్యాన్ని ఎవరు నియంత్రించగలరని నేనడుగుతున్నాను సూచిస్తుంది) నవలలో షెంజెన్‌లోని తైవానీ యాజమాన్యంలోని ఫ్యాక్టరీ ప్రధానస్థలంకాగా, "పెట్టుబడి" యొక్క విస్తృత నేపధ్యంలో ఈ ఫ్యాక్టరీ చుట్టూ అల్లుకున్న వివిధ పాత్రల పోరాటం, అవి నిర్వహించిన పాత్రల గురించి రచించబడింది. ఈ నవల 'దాస్ కేపిటల్‌ను వివరించడానికి చైనాలోని వాస్తవాలను ఉపయోగించుకొని వ్రాసిన మొదటి నవల'గా పేరుగాంచింది. అతని ఇటీవల నవల 'మింజుకె' (ప్రజాస్వామ్యంలో పాఠాలు (Taipei: Taiwan Shehui Yanjiu Zazhishe, 2013) సాంస్కృతిక విప్లవంపై తదనంతర ప్రతిస్పందనలకు తెరలేపింది. కావో నవల సాంస్కృతిక విప్లవం యొక్క ఉద్దేశ్యాలు, క్రమాలు, వైరుధ్యాలు, ప్రాధాన్యతలను చారిత్రక క్రమంలో పునర్వర్ణన చేస్తూ ఈ కథను నేటి చైనా పంథా యొక్క సమకాలీన సమస్యను అనుసంధానం చేసింది. 2013 మంత్లీ రివ్యూ సంచిక నుండి అనువదించి అందిస్తున్నాం.

**– సంపాదకుడు**

**యాన్ :** గతంలో మీరు సమకాలీన విషయాలపై రచనలు చేశారు. కాని మీ యిప్పటి (ప్రజాస్వామ్యంలో పాఠాలు) నవల చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవ నేపధ్యంతో కూడుకున్నది. మీ నవలా కథనంలో ఈ సాంస్కృతిక విప్లవం ఎలా చోటుచేసుకుంది?

**కావో :** నేను గతంలో జరిగిన విప్లవం గురించి వ్రాసినా, వాస్తవానికి యిది వర్తమాన విషయాలపై వ్యాఖ్యానమే. ఎందువల్లనంటే ప్రస్తుతం జరుగుతున్న మేథోపరమైన చర్చలన్నీ గత విప్లవాల చరిత్రకు, అలాగే సాంస్కృతిక విప్లవ చరిత్రకు అనుసంధానింపబడినవే. మనం చరిత్రను శాస్త్రీయంగా అర్థం చేసుకొని ఆ చారిత్రక అనుభవాలను వాస్తవికంగా క్రోడీకరించుకో గలిగితే భవిష్యత్తులో చైనా ఎటు పయనిస్తుందో నిర్ణయించగలం. అందుకే నా అభిప్రాయాలను వ్యక్తపరచాల్సిన అవసరం వున్నందున ఈ నవలా రచనను ఒక మార్గంగా ఎంచుకున్నాను. అత్యధిక సంఖ్యలో చైనా మేధావులు వారి యవ్వనంలో చిత్తశుద్ధితో అంకితమై సాంస్కృతిక విప్లవంలో పని చేశారు. ఆనాటి చారిత్రక వెల్లువ వీరిని విప్లవ శ్రేణుల్లోకి ఆకర్షించింది. ప్రతీ సందర్భంలో వారు విప్లవానికి నిబద్ధతగల మద్దతుదారులు. విప్లవం విజయవంతం అవడం వల్లనే సమాజంలో తమ స్థానాల్ని పొందగలిగారు. కాని నేడు వీరిలో అనేకమంది విప్లవ అవగాహన నుండి వైదొలిగారు. కొంతమంది విప్లవం రావడం ఇతరులకే మంచిదికాని తమకు కాదని విశ్వసిస్తున్నారు. అందువల్ల వారు పెద్ద ఎత్తున సాంస్కృతిక విప్లవానికి పొరపాటుగా ప్రభావితుల మయ్యామని భావిస్తున్నారు. జీవితాంతం అదొక అవమానంగా తలుస్తున్నారు. ఈ విధమైన మానసికస్థితిలో నా స్నేహితులు ఎందరో వున్నారు. అదికూడా ఏదో కొందరు వ్యక్తులు ఈ విధంగా భావిస్తే అది పెద్ద ముఖ్యమైన విషయంకాదు. కాని ఈ విధమైన భావోద్వేగం భారీ ప్రజాభిప్రాయంగా మారింది. పైగా యిది రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించ బడుతున్నది. సాంస్కృతిక విప్లవం ముగిసి ముప్పైఏండ్లయినా నేటికీ అది చైనా తన జెండాని (Banner) ఎందుకు మార్చుకోవాల్సివచ్చిందో చెప్పడానికి ఒక కారణంగా ఉపయోగించబడుతున్నది. ఆ చారిత్రక కాలంలో నివసించిన ఒక వ్యక్తిగా ఆనాటి వాస్తవిక విషయాల గురించి చెప్పి, దానిపై నిలబడటం నా బాధ్యత. నా కథా రచనలకు ఒక సత్‌సంకల్పం వుంది. నేను చూసిన చారిత్రక పరిణామాల గురించి వ్రాయడం, నేననుభవించిన మానసిక క్షోభను వ్రాయడమే ఆ లక్ష్యం. ఆ లక్ష్యాన్ని అందుకోగలిగానా లేదా అనేది నిర్ణయించాల్సింది పాఠకులే!

**యాన్ :** సాంస్కృతిక విప్లవం గురించి మీకున్న అవగాహనపట్ల నాకెంతో ఆసక్తి వుంది. ఎందుకంటే మీ నవలలో ఇది ప్రముఖమైన భాగంగా వుంది. 1970 చివరి సంవత్సరాలల్లో, 1980 తొలి సంవత్సరాలలో మచ్చ సాహిత్యం (Scar literature)గా పిలవబడేది ప్రత్యక్షమవడం ప్రారంభమైంది. ఈ రోజుకీ సాంస్కృతిక విప్లవాన్ని విప్లవాల వెలుగులోగానీ, సామ్యవాద ప్రజాస్వామ్య తర్కంపైగాని సమర్థించడం సాంప్రదాయ విరుద్ధ అంశంగా వుంది.

**కావో :** సాంస్కృతిక విప్లవం ఈ చర్చలో కీలక అంశంగా మారింది. ఎందుకు? ఎందుకంటే పెట్టుబడిదారీ విధాన కులీనులకు ప్రస్తుతం సంక్షోభం నెలకొనివున్నదని అవగతమైంది. ఈ సంక్షోభ ఫలితంగా తాము అధికారం నుండి పడిపోకుండా వుండడానికి గాను వారు సాంస్కృతిక విప్లవంపై, మావోజెడాంగ్‌పై అలాగే చైనా విప్లవాల చరిత్రంతటిపై విమర్శలు కొనసాగిస్తున్నారు. వాళ్ళ దృక్పథంమేరకు వాళ్ళకు ఈ విధంగా చేయాల్సిన అవసరముంది కాబట్టి చేస్తున్నారు. చైనా కమ్యూనిస్టుపార్టీ అధికార పార్టీ కనుక, అది తిరుగుబాటుదారులను ఉపేక్షించజాలదనే కారణం చెబుతూ కిన్ రాజవంశీకులైన రైతు విప్లవ నాయకులు చెన్‌షెంగ్ మరియు వూ గువాంగ్‌లను బీజింగ్ మ్యూజియంనుండి తొలగించడాన్ని పెకింగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకాయన సమర్థించినట్లు చదివాను. ఈ విధమైన ఆలోచన ఒకే తానులో గుడ్డలాగా చైనీయుల సాంప్రదాయ సంస్కృతి అవలంబించిన పాలక విధానాల్లో భాగమే. పాలకులు విజ్ఞతగలవారు – పాలితులకు అవగాహనా లేమి వుంటుంది. పాలితులు ఏం చేయాలో ఎలా చేయాలో తెలుసుకోవాలితప్ప ఎందుకు చేయాలో తెలుసుకో నవసరం లేదనేదే ఆ సంస్కృతి నిర్దేశించే విషయం. పాలక విధానాలను సవాలుచేయడాన్ని వారు సహించలేరు. తిరుగుబాటుగానీ, విప్లవంగానీ పాలనను కూలుస్తుంది. ఈ విధమైన ఉన్నత వర్గీయుల భావజాలంపై విమర్శగానే ఇది నేను వ్రాశాను. విప్లవంగానీ, తిరుగుబాటుగానీ అమలులోవున్న పాలక విధానాలను ప్రశ్నించడానికి అలాగే విమర్శించడానికి ప్రాతినిధ్యం వహిస్తుందని నా ఉద్దేశ్యం. పాలక వర్గంలో వున్న తప్పులను అవగాహనచేసుకొని మానవ మనుగడకవసరమైన సహేతుకమైన మార్గాన్ని సూచించడం ద్వారా నిరంతరం మానవత్వాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి మేధావులు బాధ్యత వహించాలి.

అందుకే మావో ఇలా అంటారు. "మార్క్సిజంలో అనేక సూత్రాలు వుండవచ్చు. కాని అంతిమంగా అవన్నీ ఒకే వాక్యం క్రిందికి వస్తాయి. అదే "తిరగబడే హక్కు". హాంగ్‌జూలో 'టేల్ ఆఫ్‌ది వైట్ స్నేక్' అనే నాటకాన్ని చూసినప్పుడు మావో కళ్ళనీళ్ళపర్యంతమై ఒక్కసారిగా లేచినిలబడి "ఎదిరించకుండా వుండడం సాధ్యమవుతుందా! తిరగబడకుండా వుండడం సాధ్యమవుతుందా?" అన్నారు. ఒక్క ఉదటున లేచి నిలబడడంతో ఆయన ఫ్యాంటు జారిపోయింది. నాటకం చూస్తున్నప్పుడు మావో తన ఫ్యాంటు బటన్నును వదులుచేసుకొని కూర్చున్నారు. తన ఉద్వేగాలను యిలాంటి చర్యలద్వారా వ్యక్తపరిచే వ్యక్తి మావో. చరిత్రలోని అంతర్గత తార్కికతపై ఆధారపడి మావో తిరుగుబాటును అర్థంచేసుకున్నారు. బహుశా సాంస్కృతిక విప్లవంపై నాకు ఆసక్తికలగడానికి ఆధారం ఈ ఆలోచనాధోరణే. నేను నేరుగా రెండు సమస్యలు పేర్కొనదలిచాను. మొదటిది ఆ కాలంలో సమాజంలో ఏర్పడిన ఒత్తిళ్ళవల్లే తిరుగుబాట్లు ఉద్భవించాయి. ఈ ఒత్తిడులు అకారణంగా వచ్చినవి కావు. రెండవది ఉన్నతవర్గాలు, సాధారణ ప్రజలు ఎదుర్కొనే సమస్యలు వేర్వేరుగా వుంటాయి. ఈ చరిత్ర గురించి నేను విశ్వసనీయంగా వ్రాయగలిగితే ఆ కాలపు ప్రజల కొన్ని ఆలోచనలు, అభిప్రాయాలను ఖచ్చితంగా వివరించ గలిగినవాడినవుతాను. విద్యా విషయక సిద్ధాంతాలంత స్పష్టంగా, తార్కికంగా నవలలు వుండవు. వ్యక్తుల అనుభవాలనుండి యివి మొదలవుతాయి. కాని నా నవల చైనాలో అనివార్యంగా విప్లవం సంభవించ నుందనే భావాన్ని; అంతేకాదు తిరుగుబాటు న్యాయమైనదనే ఆలోచనను వ్యక్తపరచాలని నా కథ కోరుకుంటుంది. తిరుగుబాటుకు తార్కికత, హేతుబద్ధత వున్నాయి. ఏ నాగరికదేశమూ సామాన్య జనం యొక్క చట్టబద్ధమైన హక్కులను కాదనలేదు.

**యాన్ :** మీతరం పీపుల్స్ రిపబ్లిక్‌తో కలిసి ఎదిగింది. మీతరం యొక్క విస్తృతస్థాయి అనుభవాలు ఆ కాలపు చరిత్ర యొక్క సాక్ష్యాలు. అవే మీకు ఆ చరిత్రను సరియైన స్థానంలో నిలబెట్టాల్సిన కార్యభారాన్ని అప్పగించాయి. కాని అత్యధిక ప్రజలు ఆ కాలపు చరిత్రకు సంబంధించిన ప్రత్యక్ష అనుభవాలను కలిగిలేరు. పైగా వారికి ఆనాటి కష్టసుఖాల వాస్తవాలు తెలియవు.

**కావో :** గతంలో ఈ సంస్కరణలకాలంలో సాంస్కృతిక విప్లవంపై చేసిన ప్రచారం నాపై లోతైన ముద్ర వేయలేదు. దాని గురించి సరైన అవగాహనకూడా నాకులేదు. ఈ అంశం చైనాను ఏ వైపు తీసుకెళ్ళనుందనే ప్రశ్న ఎదురైనప్పుడు మాత్రమే ఇది ప్రధానమైంది. అలా కాకుంటే ఈ నవల రాయాలనే నిర్ణయానికి వచ్చివుండేవాడిని కాదు. కొందరు సాంస్కృతిక విప్లవ విషాదం మరలా వస్తుందని భయభ్రాంతులవుతున్నారు. ఎందుకు వారు భయ పడుతున్నారు? ప్రజలకు ఆ కాలం పండుగలాంటిది. ప్రజలు సమానత్వాన్ని అనుభవించిన కాలం అది. మరోవైపు ఉన్నతవర్గాలు తమను క్రిందికి ఈడ్చి వేశారని భావించాయి. వారు ఇతరులకంటె ఉన్నతులు కాబోరు. వారు ప్రజలకు లొంగివుండాలని ఒత్తిడి చేయబడ్డారు. అందుకే తిరిగి అలాంటి పరిస్థితులొస్తాయని వారు భయపడుతున్నారు.

**యాన్ :** ఈ నవలలో మీరు సాంస్కృతిక విప్లవాన్ని "ప్రజాస్వామ్యంలో గుణపాఠాలు"గా రచించారు. సాంస్కృతిక విప్లవంలోని ప్రధాన స్రవంతి రూపమైన "అధికారపోరాటం"కు యిది భిన్నమైనది. నవల పేరుతో వర్తమాన సమాజానికి సంబంధించిన కీలక పదాన్ని (ప్రజాస్వామ్యం) పొందుపరిచారు. నేను ఈ నవల గురించి వినగానే దీన్ని వెంటనే చదవాలనే ఆసక్తి కలగడానికిదొక కారణం. ఈ నవలలో వర్ణించిన అనుభవాలు ఎలా వ్రాయగలిగారు? మీరు వ్రాస్తున్న క్రమంలో కష్టపడాల్సి వచ్చిందా లేక ప్రవాహంలా ఈ కథ సాగిందా?

**కావో :** మీ రెండవ ప్రశ్నకు ముందుగా జవాబు యివ్వనివ్వండి. అన్నిటికంటే ముఖ్యంగా చెప్పాలంటే ఈ కథ వస్తుగత చారిత్రక క్రమాన్ని ముందుంచింది. సాంస్కృతిక విప్లవంలోని ప్రధాన ఘట్టాలను తీసుకొని వాటిని ఒక క్రమంలో వుంచితే ఆ సంఘటనల మధ్యవున్న సంబంధాలను, వాటి తార్కిక అభివృద్ధిని మీరు తేలిగ్గా చూడవచ్చు. ఈ కథ ఒక చిన్న నగరంలో జరిగిన అంశాల గురించి అయినప్పటికీ మిగిలిన చోట్ల జరిగిన వాటికంటే భిన్నమైనది కాదు. మిడిల్‌స్కూళ్ళకు, కళాశాలలకు వర్క్‌టీములను పంపడం, విప్లవ ప్రతీఘాత మితవాదశక్తులను అరెస్టుచేయడం, రెడ్‌గార్డులు, తిరుగుబాటుదారులు ఏర్పడిన విధానం, వామపక్ష వాదులకు సైన్యం మద్దతిచ్చిన విధానం, విప్లవకమిటీలు ఏర్పడిన విధానం తదితర విషయాలన్నిటిలో ఈ కథ జరిగిన నగరానికి మిగిలిన ప్రాంతాలకు పెద్ద తేడా లేదు. అందువలన ప్రధాన ఘట్టాలను పేర్కొనడంలో పెద్ద యిబ్బందులేమీ ఎదురుకాలేదు. సాపేక్షంగా ఇది తేలికైన పని. ఎవరు సాంస్కృతిక విప్లవాన్ని నిందించి వాస్తవాలను తారుమారు చేశారు, చారిత్రక గమనాన్ని దాచారు, నేటి యువతను ప్రక్కదోవ పట్టించారు అనే మౌలిక వాస్తవాల సమస్యపై ఈ నవల క్లుప్తంగా పేర్కొంది. మావో ఆజ్ఞలమేరకు రెడ్‌గార్డులు తిరుగుబాటు చేశారని ఒక కథనం. అంటే రెడ్‌గార్డులు అనే సంస్థ ఒక కేంద్రీకృత సంస్థ అనీ, తిరుగుబాటు అనేది గౌరవప్రదంగా చేసే పని అన్నట్లు వీరు భావిస్తున్నారు. విద్యార్థులపై అణచివేత కార్యక్రమం మొదలయిందనీ, ఆ తర్వాత విద్యార్థుల తిరుగుబాటుకు అది దారితీసిందనే వాస్తవాన్ని పై కథనం కప్పి పుచ్చుతుంది. నేను ఒకసారి సందర్శించిన మిడిల్ స్కూల్ పదుల సంఖ్యలో తన విద్యార్థులను విప్లవ ప్రతీఘాతకులుగా ప్రకటించింది. చైనా అంతటా ఈవిధంగా ఎంతమందికి ముద్రవేశారో నాకు తెలియదు. 1966 చివర్లో కేంద్రప్రభుత్వం "బూర్జువా ప్రతీఘాత పంథా"ను స్పష్టంగా విమర్శించింది. దీనితో చైనా అంతటా తిరుగుబాటుదారులు ఒకఅనుకూలతను పొందారు. 1970 నాటికి అన్నిరకాల ప్రచారాలతో తిరుగుబాటుదారులు బలహీనపడ్డారు. మీరు ఈ చారిత్రక ప్రక్రియను అవగాహన చేసుకోగలిగితే వివిధ రాజకీయ అభిప్రాయాలున్న ప్రజలు సాంస్కృతిక విప్లవం పట్ల భిన్నాభిప్రాయాలు మరియు అనుభవాలు ఎందుకు కలిగివున్నారనేది తెలుసుకుంటారు. నా స్వంత అవగాహన కూడా కాలం గడిచేకొద్దీ మారింది. పెట్టుబడిదారీ విధాన ఫలితాలను పరిశీలించిన తర్వాత, పెట్టుబడిదారీ విధానం యొక్క రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక తార్కికతను అర్థం చేసుకున్న తర్వాత ఈ అంశంపై నా అభిప్రాయాలు మారనారంభించాయి. పనికిమాలినదిగా భావించి, వదిలివేయబడిన ప్రజాపోరాట ఎత్తుగడను తిరిగి పరిగణించటం ప్రారంభించాను. కాని సాధారణ ప్రజలు తరచుగా మరో సాంస్కృతిక విప్లవం వస్తే ఏమవుతుంది అని ప్రస్తావించుకునే ముఖ్యమైన విషయం ఒకటుంది. ఉన్నతవర్గాల మేధావులు అర్రులు సాచేదీ ప్రజాస్వామ్యం కోసమే. కార్మికులు, రైతులు కోరుకునేది కూడా ప్రజాస్వామ్యమే. అయినప్పటికీ ఈ ప్రజాస్వామ్య భావనలో వుండే విషయం ఇరువర్గాలకు వేర్వేరుగా వుంటుంది. ఉన్నతవర్గాలు రాజ్యాంగబద్ధతను కోరుకుంటాయి. అంటే మైనారిటీల హక్కులనే పరిగణనలోకి తీసుకోవాలంటారు. కార్మికులు, రైతులు సమానత్వాన్ని కోరుకుంటారు. మెజారిటీ ప్రజల హక్కులను పరిగణనలోకి తీసుకోవాలంటారు. ఈ రకంగా సాంస్కృతిక విప్లవాన్ని "ప్రజాస్వామ్యంలో పాఠాలు"గా అర్థం చేసుకోవడం సరైనదిగా వుంటుంది. ఈ తరగతిలో ఉపాధ్యాయులు లేరు. మేము ఒకరి నుండి ఒకరం నేర్చుకున్నాం – ఒకరినొకరు విముక్తి చేసుకున్నాం. ఆ తర్వాత ఏ మార్గాన్ని అనుసరించాలో ఎంచుకున్నాం. సాంస్కృతిక విప్లవం అధికారం కోసం పోరాటమనో, చైనా నాయకులను రాక్షసులుగా చిత్రీకరించడానికో, లేక కోర్టు రహస్యాలను రాజకీయ విషయాల వివరణకు ఉపయోగించుకొని ప్రజలను ఒప్పించాలనో చేస్తున్న వాదనలు తప్పుడువని చెప్పాల్సిన అవసరంలేదు.

**యాన్:** ప్రస్తుతతరం మేధావులు వారి సమయమంతా అకాడమీలలోనే గడుపుతున్నారు. వారు ఆచరణాయుత వాస్తవాలను సరిగా గ్రహించడంలేదు?!

**కావో :** 1966లో నీవు ఒక ఉపాధ్యాయుడవయి వున్నా, నీవు పెద్ద పెద్ద పోస్టర్ల ద్వారా విమర్శకు గురయివున్నా, తొలిదశల ఉద్యమంలో దానికి వ్యతిరేకంగా ఉద్యమించివున్నా, కేంద్రప్రభుత్వం తిరుగుబాటు విద్యార్థులకు మద్దతు యిచ్చినప్పుడు ఆ ఉద్వేగంలో నీవు తరిమికొట్టబడివుండే వాడివి. కాని ఇప్పుడు మనం ఆవిధంగా ఊహించలేము. మన పాఠశాలల్లోని ఉపాధ్యాయులు అర్ధరాత్రి లేచి వీధుల్లోకి వెళ్ళి పెద్ద పెద్ద అక్షరాలతో వున్న పోస్టర్లను కాపీచేసి బీజింగ్ వార్తలు విని ఒక కరపత్రాన్ని తయారుచేసి పంచుతున్నారు. ఎందువలన? వీరు చాలాకాలం అణచివేతకు గురయ్యారు. సాంస్కృతిక విప్లవంలో ఉన్నతవర్గాలు, దిగువ వర్గాలు ఎదుర్కొన్న వాస్తవ పరిస్థితులు ఒకే విధమైనవి కావు. దేశం ఏ దిశను తీసుకోవాలనే ప్రశ్నను కేంద్ర ప్రభుత్వం ఎదుర్కొన్నది. సోవియట్ యూనియన్, అమెరికాల మధ్య సాగుతున్న అగ్రరాజ్యాల పోరులో చైనా తన స్వతంత్ర ప్రతిపత్తిని, స్వాతంత్ర్యాన్ని ఎలా కాపాడుకోవాలనే పరిస్థితిని ఎదుర్కొన్నది. మరోవైపు క్రిందిస్థాయిలో క్యాడరు, జనం మధ్య దీర్ఘకాలికంగా పెరిగిపోతున్న వైరుధ్యాల పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చింది. పంథా కోసం పోరాటం దృక్పథం క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలపై పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. సాంస్కృతిక విప్లవం తొలినాళ్ళలో ప్రజలను కొట్టడం, ఇళ్ళు సోదాచేయడం లాంటి ఘటనలు జరిగాయి. అలాగే 'విప్లవ రక్తబంధం' సిద్ధాంతాలు ప్రతిపాదించబడ్డా ఈ చర్యలు ఏవీ అణచివేతకు గురైన సాధారణ ప్రజలు చేపట్టలేదు. రాజకీయ ప్రయోజనాలను అందిపుచ్చుకోగలిగిన వారు మాత్రమే ఈ చర్యలకు పాల్పడ్డారు. సాధారణ తర్కంతో కూడుకున్నదే. భయంతో మూలల్లో నక్కినవారుగానీ, వారి కొడుకులు, కూతుళ్ళుగానీ యిలాంటి చర్యలకు ఒడిగట్టలేదు. కాని చరిత్రలోని ఈ భాగం వక్రీకరించ బడింది. రెడ్‌గార్డుల విభాగంలోకి వివిధ విభాగాలలోని వాళ్ళు పోగుపడ్డారు. రాజకీయ అవకాశం వున్నవాళ్ళు తమ తప్పులను కప్పిపుచ్చుకోడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. వాస్తవానికి వీరు సాంస్కృతిక విప్లవకాలంలో తిరుగుబాటుదారులతో తమ పాత కక్షలు తేల్చుకోడానికి ప్రయత్నించినవారే.

Ô 1968లో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ "వామపక్షానికి మద్దతు" పలికినప్పటి నుండి విప్లవ ప్రతీఘాతుకులను గుర్తించి తీసివేయడం "516" ప్రకారం ఇంకా "ఒక దెబ్బ మూడు దాడులు" ద్వారా దఫదఫాలుగా తిరుగుబాటుదారులు అణచివేయబడినారు. "పదేళ్ళ విషాదం" అని పిలువబడిన ఈ కాలంలో మూడవ, నాలుగవ సంవత్సరాల నుండి చెప్పుకోదగ్గ సంఖ్యలో తిరుగుబాటుదారులు తొలగించబడ్డారు. 1976 నాటికి "మూడు రకాల ప్రజలను శుద్ధిచేయండి" (Cleansing three types of people) పిలుపుద్వారా పూర్తి ప్రక్షాళన జరిగింది. 'గ్యాంగ్ ఆఫ్ ఫోర్'కు "విప్లవ వ్యతిరేకులు''గా ముద్రవేయడం జరిగింది. కాని వాస్తవానికి తిరుగుబాటుదారులను వారు అణచి వెయ్యాలని ప్రయత్నించారు. అలాగే తిరుగుబాటు దృక్పథాన్ని ఒక సిద్ధాంతంగా వారు పూర్తిగా నిర్మూలించ బూనుకున్నారు.

**యాన్ :** సాంస్కృతిక విప్లవం ప్రధానంగా 'మానిన గాయపు మచ్చ సాహిత్యం'గా వర్ణించబడుతుంది. సాంస్కృతిక విప్లవాన్ని ఈ సాహిత్యం ఒక 'గాయం'గా చూపుతుంది. ఎక్కువ సందర్భాలలో మేధావులు, తక్కువ సందర్భాలలో కేడర్ ఈ కథనాలను అల్లింది. సాంస్కృతిక విప్లవంలో నిస్సందేహంగా అనేక గాయలు కలిగాయి. కాని మీరు చెప్పిన బాధల వృత్తాంతాలకు, 'గాయపు మచ్చ సాహిత్యం' బాధలకు తేడా వుంది. ఉదాహరణకు బాధ, అవమానాలనుభరించడం ఒకవిధమైన గాయం అయితే, ఈ నవలలో తిరుగుబాటుదారులు, మేధావులు, ఇంకా పాత విప్లవకారులు లాంటి వివిధ గ్రూపులవారు గాయపరచ బడ్డారు. మీ రచనలో వివిధ సమయాల్లో వివిధ గ్రూపులు అనుభవించిన బాధలను అనుసంధానం చేశారు. ఈ బాధాకర అనుభవాలను మీరు ఎలా చూస్తారు?

**కావో :** విశాల దృక్పథంతో చూస్తే మొత్తం విప్లవ చరిత్రే బాధలు, కష్టాలతో నిండివుంది. ప్రజలు భావించేవిధంగా విప్లవం అందమైనదేమీ కాదు. సంఘర్షణలో వున్న ఇరువర్గాలు కూడా అంత స్పష్టంగా వుండవు. మొత్తం విప్లవ క్రమం బాధలు, కష్టాలతో నిండి వుంటుంది. ఈ నవలలో నేను ఎక్కువభాగం బాధలుపడ్డ ఇద్దరు వృద్ధ విప్లవకారుల పాత్రలకే కేటాయించాను. వీరు ఎందుకు విప్లవంలో పాల్గొన్నారనే ప్రశ్నకు జవాబు కోసం అన్వేషించాను. అది వ్యక్తిగత లాభానికా, మార్పుకొరకా? అదే గనుక అయితే విప్లవం అంటే ఒక జట్టు నాయకులను తీసివేసి మరోజట్టు నాయకులతో భర్తీచేస్తే దానిలో చెప్పుకోదగ్గ అంశం ఏమిటి? ఇదే తర్కం సాంస్కృతిక విప్లవానికీ వర్తిసుంది. దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళాలనేది నిజమైన లక్ష్యం అయితే కొద్దిమంది మేధావులకు కలిగిన అసౌకర్యం పెద్ద లెక్కలోది కాదు. వాస్తవానికి వారు భరిస్తున్న అసౌకర్యం పెద్దదేమీ కాదు. వాళ్ళకు వాగ్దానం చేసిన వేతనాలను వారు యిప్పటికీ పొందుతున్నారు. అయితే రోడ్లు ఊడ్చటం, గ్రామాలకు వెళ్ళి పనిచేయడం లాంటి శారీరక శ్రమతో కూడిన పనుల్లో భాగస్వాము లవ్వాలి. కాని వారి వేతనాలు వారికి వస్తాయి. వీరిని చెయ్యమన్న పనులు రైతులు తరతరాలుగా చేస్తున్న పనులే. కొన్ని మినహాయింపు సందర్భాలలో మేధావులను కొట్టారు, అవమానపరిచారు. కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. కాని ఇవి సాధారణంగా జరిగిన కేసులు కాదు. చెదురుమదురు సంఘటనలు మాత్రమే. మేధావులను హింసించినవారు అనివార్యంగా ఇతర మేధావులు మాత్రమే. ఇది చైనా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో స్పష్టంగా కనిపించింది. వీటిల్లో మేధావులు వారి శత్రువులను విమర్శించడానికి, అవమానించడానికి వినూత్న పద్ధతులను రూపొందించారు. ఇవి కార్మికులు, రైతులు చేసిన పనులు కావు. మేధావులు ఈ పనులను ఒక విపత్తుగా అవమానంగా భావిస్తే, రైతులు తమ రోజువారీ అనుభవాలను ఎంత దురదృష్టమనుకోవాలి!? మీరు రైతుల కంటే మెరుగు అని చెప్పుకోడానికి మీలో వున్న గొప్పతనం ఏమిటి?

"గాయపు మచ్చ సాహిత్యం" ద్వారా వచ్చిన రచనలు సినిమాలుగా కూడా వచ్చాయి. ఇందులో యుక్త వయస్సులో వున్న ఒక మహిళా మేధావి గ్రామీణ ప్రాంతానికి పంపబడుతుంది. అక్కడ బ్రిగేడ్ నాయకుడు లేక మూర్ఖుడైన తిరుగుబాటుదారుడు ఈమెపై అత్యాచారం చేసినట్లు చూపబడుతుంది. ఇవన్నీ హాస్యాస్పదం. నేను 1968లో గ్రామీణ ప్రాంతానికి వెళ్ళాను. విద్యార్థులను చూసి రైతులు ఈర్ష్య పడేవారుగాని ఎప్పుడూ వారినుండి ప్రయోజనాలు పొందాలనిచూసేవారుకాదు. ఉదాహరణకు మీకులాగా ఎవరైనా ఒక మహిళ కళ్ళద్దాలు పెట్టుకుంటే వింతగాచూసేవారు. "ఆ అమ్మాయిని చూడు కళ్ళద్దాలు పెట్టుకుంది" అనేవారు. 1970ల మధ్యకాలంలో కొందరిని నగరాల్లోని ఫ్యాక్టరీలలో పనిచేయడానికి కేడరుగా, లేక తిరిగి యూనివర్సిటీలకు పంపారు. కొద్దిమంది మాత్రమే తిరిగి వెళ్ళలేకపోయారు. ఎందుకంటే అలా వెళ్ళడానికి స్థానిక రైతుల సిఫార్సు అవసరం. సాంస్కృతిక విప్లవం తొలినాళ్ళలో ఈ విధంగా జరుగలేదు. ప్రజలకు బ్రిగేడ్ నాయకుని అనుమతి అవసరం అన్న తర్వాతనే అతని మెప్పుకొరకు వ్యవహరించడం మొదలుపెట్టారు. ఆ రోజుల్లో ఈ విధంగా ఒకచోటునుండి మరొక చోటుకు పంపబడిన యువకులు తరుచుగా వివిధ కమ్యూన్‌లను సందర్శించేవారు. పెద్ద పండుగలప్పుడు మాత్రమే కలిసేవారు. అలాంటప్పుడు ఆకలిగా వున్నప్పుడు కోడి పెట్టల్ని దొంగిలించేవారు. గ్రామీణ కేడరు వీరిపట్ల భయంగా వుండేవారు. వీరినెప్పుడూ తక్కువగా చూసేవారు కాదు. అయితే అన్ని సందర్భాలలోనూ యిలాగే జరిగిందని చెప్పలేము. కానీ మొత్తంమీద యిది వాస్తవం. పైన చెప్పిన కథ సానుభూతి పొందడానికి ఉద్దేశించబడినది. నా నిస్సహాయతను వాడుకున్నారు, నన్ను గాయపరిచారు ఈ విధమైన పద్ధతితో మేధావులపట్ల సానుభూతి పెరుగుతుంది.

**యాన్ :** ఇది చాలా ఆసక్తికరం. ఎక్కువగా "గాయపు మచ్చ సాహిత్యం"లో సెక్స్, శరీరం ప్రధాన పాత్ర వహించాయి. వయసులోవున్న ఆడపిల్లలకు జరిగిన అవమానాలు చూపి పాఠకుల నుండి సానుభూతిని పొందేందుకు ప్రత్యేకంగా ఈ సాహిత్యం దోహదపడింది.

**కావో :** అవును. అది నిజమే. వారికున్న ప్రాపంచిక జ్ఞానాన్ని రెచ్చగొట్టే విషయాలు వ్రాయడానికి ఉపయోగించారు. నా రచన వారిలాగా కాక విషయాలను స్పష్టం చేయడానికి, అవి అవాస్తవిక విషయాలని చెప్పడానికి జాగరూకతతో చేసిన కృషి.

**యాన్ :** అయితే మీరు సాంస్కృతిక విప్లవ కాలంలో జరిగిన తీవ్రమైన, దుష్టసంఘటనలను ఎలా అర్థం చేసుకుంటారు?

**కావో :** ఏ చారిత్రక కాలాన్నైనా, ఏ ఉద్యమాన్నైనా దానిలో జరిగిన ముఖ్యఘట్టాల ఆధారంగా మాత్రమే మదింపు చేయాలి. ఎందుకంటే అవే దాని స్వభావాన్ని నిర్వచిస్తాయి. ప్రతివ్యక్తి జీవితంలో దుఃఖమయ సంఘటనలు వుంటాయి. ప్రతి కాలంలోనూ విషాద ఘట్టాలుంటాయి. మనలో ప్రతి ఒక్కరికీ జరిగే దురదృష్టకర విషయాలలో తేడా వుంటుంది. నీవు ఆ విషయాల యొక్క స్వభావాన్ని బట్టి చూడలేకపోతే లేక నీవు కావాలనే ప్రధాన ఘట్టాలను, తక్కువ ప్రాధాన్యత గల విషయాలతో ముడిపెట్టి గందరగోళం చేస్తే నీవు శాస్త్రీయంగా, స్పష్టమైన అవగాహనతో గత చరిత్రను తెలుసుకోలేవు. మనం సాంస్కృతిక విప్లవాన్ని హేతుబద్ధమైన, నిజాయితీతో కూడిన మదింపు చేయాల్సిన అవసరం వుందనడంలో సందేహంలేదు. వాస్తవాలనుండి సత్యాన్ని శోధించగలిగి నపుడు మనం తగిన పాఠాలను నేర్చుకోగలము. సాంస్కృతిక విప్లవకాలంలో ఏమైనా చెడు జరిగిందా? అవును. ఏవైనా వికారపు చేష్టలు జరిగాయా? అవును. ఈ విషయాలు జరిగాయి. నాకు నచ్చని విషయాలు అనేకం ఆ కాలంలో జరిగాయి. కానీ అవి ప్రధాన స్రవంతిలోవి కావు.

**యాన్ :** మీకు నచ్చని విషయాలు ఎలాంటివి?

**కావో :** వ్యక్తి ఆరాధనా సంస్కృతి, లాంఛనప్రాయత, నినాదాలను సిద్ధాంతాలుగా మార్చడం, కేంద్రప్రభుత్వ వ్యాఖ్యానాలలోని స్ఫూర్తిని సిద్ధాంతాలుగా స్వీకరించడం, అలాగే ఇప్పుడు చేస్తున్నట్లు వాటిని ఆకాశానికెత్తడం.

**యాన్ :** ఈనాడు జిడిపిని పరిగణిస్తున్న విధంగా...

**కావో :** అవును. ఖచ్చితంగా అలానే. 1970లలో ఈ టేబుల్ కంటే పెద్ద డ్రమ్ములతో ప్రచారదళాలు రోడ్లమీద తిరుగుతుండేవి. వాళ్ళు డ్రమ్మును వాయించి "సాంస్కృతిక విప్లవం గొప్పది" అని అరిచేవారు. సాధారణజనం దీన్ని చూసి గమనించి వాళ్ళుకూడ 'సాంస్కృతిక విప్లవం గొప్పది' అని తప్పక చెప్పాలేమో అని చెప్పేవారు. చివరకు అది ఒక శిక్షగా మారింది. సరే తప్పుడు సంఘటనలు జరిగాయి. కేడరు, ప్రజలతో ఘర్షణపడేటపుడు ప్రజలు వారి జుట్టు పట్టుకొనేవారు. వాళ్ళ చేతికి చిక్కకుండా వుండడానికి కేడరు తమ జుట్టుపై ఎక్కువ నూనెను పూసుకునేవారు. ప్రజలు కూడా తమ జుట్టు కేడరుకు అందకుండా బురద పూసుకునేవారు. నిజమే. ఇవి చెడ్డవే. కాని ఆ కాలంలో జరిగిన ప్రధాన స్రవంతిలో ఘట్టాలు కావివి. సాంస్కృతిక విప్లవాన్ని అట్టడుగు జనం ఆహ్వానించారని నేను ఎందుకు చెప్పగలనంటే వాళ్ళ కళ్ళముందు సమానత్వమనే మెరుపు కనిపించింది. ప్రతివారు పెద్ద పోస్టరు వెయ్యగలరు. ప్రతి అధికారిపై పర్యవేక్షణ వుంటుంది. చైనా కమ్యూనిస్టుపార్టీ ఏవిధంగా నేషనలిస్టులను ఓడించగలిగింది? ఏవిధంగానంటే, సైనికులు, అధికారుల మధ్య వున్న సమానత్వం ద్వారా! యుద్ధాల్లో తమ ప్రాణాలనైనా త్యాగం చెయ్యడానికి పార్టీ సభ్యులు ముందుంటారు. యుద్ధంలో విజయం సాధించడానికిదే కారణం.

సాంస్కృతిక విప్లవానికి 17సం॥ల ముందు కాలంలోనే చైనా ఎన్నో సాధించింది. అయినా ఎన్నో సమస్యలుండేవి. కొందరు అధికారులు సామాన్య జనం నుండి దూరమవడం ప్రారంభించారు. అబద్ధాలాడడం, అతిశయోక్తులు చెప్పడం సర్వసాధారణమైపోయింది. సామాన్య జనాన్ని అడ్డుపెట్టుకొని ప్రయోజనాలను పొందడం కూడా జరిగేది. అందుకే సాంస్కృతిక విప్లవం అందరికీ ప్రకటించుకున్న అవకాశం యిచ్చింది. కొందరు ఎవరికైనా వ్యతిరేకంగా పోరాడే క్రమంలో వారే దెబ్బతినే అవకాశం వుండొచ్చు. ఇలాంటి విషయాలు జరిగాయి. కాని అవి సర్వసాధారణ విషయాలు కావు. అనేక మంది అధికారులు ఎదురొడ్డి పోరాడారు. అధికారాన్ని కోల్పోయారు. వాళ్ళు సాధారణ ప్రజలతో కలిసి ఫ్యాక్టరీలలో పనిచేయవలసి వచ్చింది. కాని ప్రతి ఒక్కరూ వారిని మంచిగా చూశారు. వారితో సరదాగా హాస్యాలాడుతూ గడిపారు. ఎవరినీ చెడ్డవారుగా పరిగణించి ప్రవర్తించలేదు. వాళ్ళు తాత్కాలికంగా అధికారాన్ని కోల్పోయారు. వారు అధికారాన్ని తిరిగి పొందినాక, వారికి ఈ పునరావాసం భరించలేనిదిగా, నరకానికి పంపబడినట్లుగా వారు భావించారు. అంటే సాధారణ ప్రజలు సంతోషంగా వుంటే వారు సంతోషంగా లేరు. వాళ్ళు అవమానంగా భావించారు. ఏదో పోగొట్టుకున్నామనే భావనకు గురయ్యారు. వాస్తవానికి అప్పటికీ సాధారణ ప్రజానీకానికి వారికి ఒక తేడా వుంది. వాళ్ళ జీతాలు అధికంగానే వున్నాయి. కార్మికులు వారానికి 34 యువాన్లు సంపాదించేవారు. కాని జనం ఈ జీతాల తేడా గురించి పట్టించుకునేవారు కాదు. ఎందుకంటే అధికారులతో వారు సమానస్థాయిలో వున్నామని భావించేవారు. తాత్కాలికంగానైనా అధికారులతో కలసి వుండగలుగుతున్నామనే సంతోషంతో వుండేవారు. సాధారణ ప్రజానీకం సమానత్వాన్ని సాధించుకోగలిగామని భావించేవారు. చైనా ఎలాంటి సిద్ధాంతాన్ని ఆచరించాలనే విషయంపై వారికెలాంటి ఆలోచనాలేదు. ఆ సమయంలో పెట్టుబడిదారీ విధానమంటే ఏమిటో వారి ఆలోచనలోలేదు. వాళ్ళెప్పుడూ చూడలేదు. ఎవరు మాత్రం ఎలా తెలుసుకోగలరు?

1968 తర్వాత సాంస్కృతిక విప్లవం తన దిశను తప్పడానికి గల కారణాల్లో యిది ఒకటి. 1966 అక్టోబరులో సామాన్యజనాన్ని అణచివేసిన "బూర్జువా ప్రతీఘాతకుల''కు వ్యతిరేకంగా సాగిన రాజకీయ ప్రచారంతో ఈ విషయాలు మొదలయ్యాయి. ప్రతి ఒక్కరూ వీరికి వ్యతిరేకంగా ఎదురు తిరిగారు. అధికార్ల అధికారాలను తగ్గించారు. ఆ తర్వాత పెట్టుబడిదారీ అధికార నిర్వాహకులను బయటకు లాగండి" (Take out the Capitalist Power Holder) ఉద్యమం వచ్చింది. ప్రతి ఒక్కరూ యిలాంటి వ్యక్తులను పట్టుకోడానికి ఆధారాలను వెతకడం ప్రారంభమైంది. ప్రజలు ఎక్కువమందిని కనిపెట్టలేదు. మతాల నేరాలు చేసిన అధికారులు, భిన్నాభిప్రాయాలున్న ప్రజలను ఎడంగా పెట్టినవారు, సాధారణ ప్రజలను నొప్పించినవారు, బాగా తినటానికి, తాగడానికి వారి అధికార స్థానాన్ని వుపయోగించుకొన్నవారి వంటి అధికారులు తప్ప అసాధారణ విషయాలేమీ బయట పడలేదు. అందువల్ల ఈ ఉద్యమం త్వరలోనే తన దిశను పోగొట్టుకుంది. దీనివల్ల తర్వాత కాలంలో భిన్నగ్రూపులు (విధేయులు, తిరుగుబాటుదార్లు) తయారయ్యారు. ఇది విప్లవ కమిటీల ఏర్పాటులో కూడా పాకాయి. ఈ గ్రూపులు ఏర్పడిన తర్వాత సంస్థలోపల ఎవరు ప్రముఖపాత్ర వహించాలని అంటే అధికారాలను ఏవిధంగా పంపిణీ చేయాలనే ప్రశ్న ఉద్భవించింది. దీని ఫలితంగా రెండు ముఠాలు ఏర్పడ్డాయి. ఈ రెండు ముఠాల ఏర్పాటుకు కారకులుగా పాత నాయకుల గ్రూపు నిలబడింది. ఈ కారణంగా ఈ ముఠాల మధ్య ఘర్షణలు మరింత తీవ్రమై సాయుధ సంఘర్షణల స్థాయికి చేరాయి. క్షేత్రస్థాయిలో ఇది సాంస్కృతిక విప్లవం లాంటిదే. నేను కేంద్రప్రభుత్వస్థాయిలో ఏం జరిగిందో మాట్లాడడంలేదు. ఆ స్థాయిలో ఆనాటి అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో చైనా ఏ మార్గాన్ని ఎంపిక చేసుకోవాలనే అంశం గురించి వుంది. కాని క్షేత్రస్థాయిలో అలాంటిదేమీలేదు. వాటి గురించి ఎలాంటి ఆలోచన వీరికి లేదు.

**యాన్ :** అంటే మీరు చెప్పేదాని ప్రకారం అత్యధిక ప్రజానీకం "పెట్టుబడిదారీ మార్గం తీసుకుంటుందని" అర్థం చేసుకున్నారా? ఎందుకంటే అధికారులు ప్రత్యేక సదుపాయాలను అనుభవిస్తున్నారు. ఈ ప్రత్యేక సదుపాయాలను సాంస్కృతిక విప్లవం తొలగిస్తుందని భావించారంటారా?

**కావో :** ఔను... నిజమే. ప్రత్యేక సదుపాయాలను తొలగిస్తే వారు అసంతృప్తి పొందుతారు. తిరిగి ప్రజాస్వామ్యం విషయానికొస్తే మావో జెడాంగ్ లేవనెత్తిన అంశం ఎల్లప్పుడూ వాస్తవికంగా వుంది. ఆయన ముందుకు తెచ్చిన నినాదం గురించి మీరు ఆలోచించారా? ఆయన తన వారసుని కోసం చూస్తున్నాడు కాని ఆయన కోట్లాది శ్రామికులు తన వారసులుగా పనిచెయ్యాలన్నారు. అది చాలా మంచి విశాలమైన ఆలోచన. నీ వారసత్వం కోసం ఒకరిద్దరు వ్యక్తులను వెతుక్కోవడం పెద్ద కష్టమేమీ కాదు. కాని విప్లవం విజయవంతంకావాలంటే కోట్లాది వారసులు నీకు అవసరమవుతారు. మావో జెడాంగ్ ఈవిధంగా ఆలోచించారని నేననుకుంటున్నాను. ప్రజలకు అధికారం యివ్వడమంటే అదొక రకం ప్రజాస్వామ్యం. ఈ ప్రజాస్వామ్యం ప్రజలను సమాజానికి యజమానిగా సుస్థిరం చేస్తుందని ఆయన భావన. అందుకే ఆయన 'రెండు తప్పనిసరి' (Two musts)లను ప్రకటించారు. ఒకటి అన్‌షాన్ రాజ్యాంగం (Anshan Constitution) రెండవది ప్యారిస్ కమ్యూన్ విధానాలు. ఆయన ఉత్పత్తి సంస్థలలో రెండు భాగస్వాములు, ఒక సంస్కరణ మరియు మూడు కలయికలను ఎందుకు నెలకొల్పారు? (ఉత్పాదకక్రమలో కేడర్ భాగస్వామ్యం, మేనేజ్‌మెంట్‌లో కార్మికుల భాగస్వామ్యం; సహేతుకంకాని, కాలంచెల్లిన నిర్హేతుకమైన నిబంధనలను సంస్కరించడం; కార్మికులు, కేడర్‌లు మరియు సాంకేతిక నిపుణుల మధ్య సహకారము) కేడర్స్ నుండి మూడురకాల సమానతలకు ఎందుకు ఆయన డిమాండ్ చేశారు? (తినడం, నివసించడం మరియు ప్రయాణం చేయడంతో నాన్ కేడర్లతో సమానంగా వుండాలి). అలాగే మావో పరిశోధన మరియు క్షేత్రస్థాయి పరిశీలనలకు ఎందుకంత ప్రాధాన్యమిచ్చారు? అధికార స్వామ్య రాజకీయాలు చెడ్డవని ఆయన అభిప్రాయం. వీటిని మొదటి నుండి మావో అసహ్యించుకునేవారు. మావో ఉపాధ్యాయుల్లో ఒకరైన క్సీజ్యూజాయ్ (Xie Jue Zai)ని మావో గురించి అడిగినపుడు ఆయన మావో అధికారస్వామ్య సంస్కృతిని నిఖార్సుగా వ్యతిరేకించే వాడన్నారు. అధికారయుత సంస్కృతి అంటే ఇక్కడ అధికారస్వామ్యమే, మావో ఎప్పుడూ ఫ్లాట్ మేనేజ్‌మెంటుని (Flat Management) సమర్థించేవారు. కార్మికులు, రైతులు యాజమాన్యంలో భాగస్వాములు కావాలనీ, అలాగే కేడర్‌లు శ్రమలో పాల్గొనాలని కాంక్షించేవారు. ఇవి సాకారమయ్యాయా లేదా అనేది వేరే ప్రశ్న. కాని మావో వీటిని ఆదర్శాలుగా పరిగణించారు. ఇందువల్లనే సాంస్కృతిక విప్లవాన్ని నేను 'ప్రజాస్వామ్యంలో పాఠాలు'గా అర్థంచేసుకున్నాను. మావోకు కూడా దీన్ని ఎలా తీసుకెళ్ళాలనే అంశంపై స్పష్టమైన ఆలోచనలేదు. ఆయన చాలా కాలంగా ఈ వేధించే సందేహాలు కలిగివున్నాడు. వీటి గురించి ఏం చేయాలో కూడా ఆయనకు తెలియదు.

సాంస్కృతిక విప్లవం యొక్క ప్రధాన స్రవంతి అవగాహన గురించి మీరు ఇంతకు ముందు అడిగారు. అది ఒక అధికార పోరాటం (Power Struggle). నాకైతే ఈ వ్యాఖ్యానం చాలా సంకుచితమైనదిగా కన్పిస్తుంది. 1965లో నాలుగు పరిశుభ్రతలు (Four Cleanings) ఉద్యమం ఫలితంగా పార్టీలో లియుషావోకి పతనం జరిగింది. కనుక, లియుషావోకితో వ్యవహరించాలనుకుంటే అది మావోకు చాలా తేలికే. గానీ అందుకోసం ఇంత పెద్ద ప్రజాఉద్యమాన్ని ప్రారంభించాల్సిన అవసరంలేదు. కాని ఆయన సంస్కృతిలో విప్లవం కోసం అనుసరించిన పద్ధతి ఇది. చైనా సంస్కృతి, ప్రత్యేకించి అధికార రాజ్యసంస్కృతి విప్లవానికి గురికాబడాల్సిన అవసరం వుంది. అది అప్పుడు మార్పుకు గురికాకపోతే, ఎప్పుడైనా పురోగామి కృషిని నిర్వీర్యం చేస్తుంది. విద్యను పొందడం అధికారస్వామ్యానికి ఒక మార్గంగా, తిరిగి ఈ అధికారస్వామ్యం సామాన్య ప్రజల వీపులపై ఎక్కి స్వారీ చేయడానికి ఒక సాధనంగా ఉపయోగపడేది. కిన్‌గ్ వంశపాలనాకాలపు (Qing Dynasty) చివరి రోజుల్లో "అధికారులు విదేశీయులను చూసి భయపడ్డారు. విదేశీయులు ప్రజలను చూసి భయపడతారు. ప్రజలు అధికారులను చూసి భయపడతారు." అనే నానుడి ప్రజల్లో ఎందుకు వుంది? ఎందుకంటే అధికారస్వామ్య సంస్కృతి వలన. ప్రజలు ఆత్మీయంగా (Spiritually) నిలబడలేకపోయివుంటే, వారు తమను

**(తరువాయి 6వ పేజీలో)**

# భారత దేశంలో ప్రజాందోళనలు

## మధ్యప్రదేశ్

1984–భోపాల్ విషవాయు పీడితులు 30 సం॥తర్వాత కూడా తమకు నష్టపరిహారం చెల్లించకపోవటాన్ని నిరసిస్తూ 2013 ఆగస్టు 30న భోపాల్ నగరంలో భారీప్రదర్శన నిర్వహించారు. ప్రతి బాధితునికీ రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక విపత్తుగా పేర్కొంటున్న ఈ ఘటనలో యూనియన్ కార్బైడ్ 50వేలమంది కార్మికులను, ప్రజలను బలిగొంది. చనిపోయిన వారు చనిపోగా, బ్రతికున్న వారు వివిధ రకాల జబ్బులతో ఆనాటినుండీ బాధలనుభవిస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్

డిసెంబర్ 4న నల్గొండజిల్లా–నారాయణపురం మండలం, రాచకొండ ప్రాంతంలోని సుల్తాన్‌ములా వద్ద ఆదివాసులు పెద్దఎత్తున సమీకృతులై, ఆ ప్రాంతంలో ఓ అణుక్షిపణి ప్రయోగ స్థావరాన్ని నిర్మించే తలంపుతో స్థలపరిశీలనకై వచ్చిన రెవిన్యూ అధికారులను అడ్డుకొని తీవ్ర నిరసన తెలియజేశారు. 'మా ప్రాంతానికి మరోసారి రావద్దు–మా భూములను బలవంతంగా కబ్జాచేయొద్దు' అంటూ వారిని వెంటబడి తరిమారు. వారిని విస్థాపనకు గురిచేసి, వారి జీవనాధారాన్ని తొలగించివేసే ప్రభుత్వ చర్యలను వారు తీవ్రంగా నిరసించారు.

డిసెంబర్ 2న, ఖమ్మంజిల్లా ఇల్లెందులో సింగరేణి కాలరీస్ లిమిటెడ్ చేపట్టదలచిన ఓపెన్‌కాస్ట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ ప్రజలు ఓ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.

## గుజరాత్

2013 డిసెంబర్ 19న గుజరాత్ రాష్ట్రంలో రైతులు అనేకమంది ఢిల్లీ చేరుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరంతా గుజరాత్ రాష్ట్రం దొలేరాను ప్రత్యేక పెట్టుబడి మండలంగా ప్రకటించటాన్ని తీవ్రంగా నిరసిస్తూ, వెంటనే ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక పెట్టుబడుల మండలం (యస్ఐఆర్) ప్రాంతంలోని 22 గ్రామాల్లో ఇప్పటికే మోటారు వాహనాలతో ప్రదర్శనలు నిర్వహించారు.

## ఉత్తరాఖండ్

డిసెంబర్ 25న చాందీజిల్లాలోని జోషిమఠ్‌లో గ్రామస్థులు ఆ ప్రాంతంలో నిర్మించనున్న 171 మె.వా. సామర్థ్యంగల జలవిద్యుత్ కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ, ఇది తమ ప్రాంతంలోని అనేక పర్యావరణ సమస్యలకు కారణమౌతుందన్నారు. ఎన్‌టిపిసి ఈ ప్రాజెక్టు నిర్మాణంకోసం భూగర్భంలో ఓ కందకం తవ్వటానికి కొన్ని ప్రేలుళ్ళు చేపట్టింది. జగ్గు, జాగార్డ్ అనే రెండు గ్రామాలు వున్న పర్వతప్రాంతం క్రింద భాగంలో ఈ ప్రేలుళ్ళు చేపట్టారు. ఈ ప్రేలుళ్ళు తమ గ్రామాల ఉనికికే ప్రమాదకరంగా పరిణమిస్తాయని గ్రామస్థులు భయాందోళనలకు గురౌతున్నారు. 2009లో ఒకసారి ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణ సందర్భంగా గ్రామస్థులు తమ తీవ్ర నిరసనను తెలియజేశారు. తప్పుడు సమాచారం పొందుపరచి ప్రభుత్వాధికారులు పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక రూపొందించారని వారు పేర్కొన్నారు.

## జార్ఖండ్

2014 జనవరి 7న లతేహార్‌జిల్లాలోని జాలా అనే ఓ కుగ్రామానికి చెందిన 250 మంది ఆదివాసీ ప్రజానీకం టాటాస్టీల్ మరియు ఆధునిక్ పవర్ అండ్ రిసోర్స్ లిమిటెడ్‌ల ఆధ్వర్యంలో తమ ప్రాంతంలో సాగించబోయిన బొగ్గు తవ్వకాలను అడ్డుకున్నారు. తమ సమస్యలను, ప్రతిపాదనలను పరిష్కరించకుండా వారి పనిని సాగనీయబోమని హెచ్చరించారు. గత 14 నెలల కాలంలో, ఈ పరిశ్రమల యాజమాన్యం తరపు గూండాలు తమను అనేక విధాల బెదిరింపులకు గురిచేశారని, కంపెనీ పనులకు అడ్డుపడవద్దని హెచ్చరించారని వారు పేర్కొన్నారు. 456 హెక్టార్ల అటవీ ప్రాంత భూములపై తమకు గిరిజన చట్టాల ప్రకారం హక్కు కల్పించాలని ఆదివాసులు డిమాండ్ చేస్తున్నారు.

అయితే, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, వారి హక్కులను గుర్తించటానికి బదులుగా పరిశ్రమల యాజమాన్యంతో కుమ్మక్కైన అటవీశాఖ అధికారులు 13 మంది అమాయక ఆదివాసీలపైననే కేసు నమోదు చేశారు. వీరంతా అటవీ సంపదను హరించివేస్తున్నారని, చెట్లను నరికి నాశనం చేస్తున్నారని పేర్కొంటూ వారి గ్రామపెద్ద మరియు జాలా అటవీప్రాంత గిరిజన హక్కులకమిటీ నాయకులపై రెండేసి చొప్పున కేసులను బనాయించారు.

2014 జనవరి 21న వందలాదిమంది రైతులు రాంచీలో ప్రదర్శన నిర్వహించి జార్ఖండ్ ముఖ్యమంత్రి రాంచీ శివారు ప్రాంతంలో నూతన అసెంబ్లీ భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయటాన్ని నిరసించారు. రెండుసార్లు విస్థాపనకు గురవటాన్ని రైతులు మరియు గ్రామస్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ప్రభుత్వం తమనుండి స్వాధీనం చేసుకొన్న భూములకు సమంజసమైన నష్టపరిహారాన్ని అందించవలసిందిగా డిమాండ్ చేశారు.

## ఒడిషా

నవంబర్ 29న ఒడిషాలో ప్రభుత్వ యాజమాన్యంలోని కోల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో తాల్చేర్ బొగ్గుగనుల వద్దనున్న 7 ఓపెన్ కాస్ట్ గనులలో పనిచేసే కార్మికులు తమ పనిముట్లను కిందపడవేసి, మేనేజర్ కార్యాలయంపై విరుచుకుపడ్డారు. 100 మంది ఓపెన్‌కాస్ట్ కార్మికుల తొలగింపును వారు తీవ్రంగా నిరసించారు.

## మేఘాలయ

2013 ఆగస్టు 29న 15 వేల మంది మేఘాలయకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పెన్‌డౌన్ సమ్మె చేశారు. ఏకీకృత వేతనాల విధానంతోపాటు ఏకీకృత సౌకర్యాలు, విద్యావిధానం వుండాలని వీరు డిమాండ్‌చేస్తూ, ఈ డిమాండ్లపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వీరంతా పెన్‌డౌన్ చేసి నిరసన తెలిపారు.

20 శాతం వేతనాలలో కోత విధించటాన్ని నిరసిస్తూ భూపేంద్ర నారాయణ్ మండల్ విద్యాసంస్థలో ఉపాధ్యాయులు నవంబర్ 26 నుండి యూనివర్శిటీలో బైఠాయింపు కార్యక్రమాన్ని చేపట్టి నిర్వహించారు. ✡

**వివిధ దేశాలలో...** (7వ పేజీనుండి)

## జర్మనీ

20 వేల మంది కార్మికులుపైగా జర్మనీ దేశవ్యాపితంగా 'ఇఎడిఎస్' అనబడే యూరోపియన్ ఏరోస్పేస్ కంపెనీ ఇతర పరిశ్రమల స్థాపనను కట్టడిచేయటాన్ని తద్వారా వేలమంది నిరుద్యోగులుగా మారనున్న పరిస్థితిని వ్యతిరేకిస్తూ నిరసన తెలియచేశారు.

## పోర్చుగల్

లిస్బన్‌లో సబ్‌వే సిబ్బంది నవంబర్ 28న పొదుపు చర్యలను,ఇతర కోతలను వ్యతిరేకిస్తూ సమ్మె చేశారు. నవంబర్ చివరి వారంలో పోస్టల్ కార్మికులు నేషనల్ మెయిల్ సర్వీసును ప్రైవేటీకరించటాన్ని వ్యతిరేకిస్తూ సమ్మెచేశారు.

## పరాగ్వే

2013 ఆగస్టు 1 నుండి పరాగ్వే దేశవ్యాపితంగా ఉపాధ్యాయులు యావన్మందీ నిరవధిక సమ్మెలోకి వెళ్ళారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రభుత్వంవైపు నుండి ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన చెల్లింపులను పూర్తిగా రద్దుచేయటాన్ని నిరసిస్తూ వీరంతా నిరసన తెలిపారు. అనేక నగరాలలో వీరు రహదారులను దిగ్బంధించారు. రోడ్లపై బైఠాయించారు. ప్రదర్శనలు నిర్వహించారు.

## నైజీరియా

నైజీరియాలోని పాలిటెక్నిక్ ఉపాధ్యాయులు అక్టోబర్ 4 నుండి సమ్మెలోకి వెళ్ళారు. పాలిటెక్నిక్ విద్యాసంస్థలలో మరింత నిధులను వెచ్చించాలని ప్రభుత్వాన్ని వీరంతా డిమాండ్ చేస్తున్నారు.

## పాకిస్థాన్

పాకిస్థాన్‌లోని సింధు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు 2014 జనవరి 16న సమ్మె ప్రారంభించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న టైమ్ స్కేల్ వేతనాల చెల్లింపు, బోధన, ప్రయాణ భృతుల చెల్లింపు, తదితర సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. (తరువాయి 2వ పేజీలో)

**చైనా సాంస్కృతిక...** (5వ పేజీ తరువాయి)

తాము నియంత్రించుకోవటం ఎప్పటికీ సాధ్యమయ్యేది కాదు. అంటే ప్రజల చారిత్రక పాత్ర ఎప్పటికీ ఏర్పడేదికాదు. మావో జెడాంగ్ తన జీవిత చరమాంకంలో తీసుకున్న చివరి ప్రయత్నంగా నేను సాంస్కృతిక విప్లవాన్ని అర్థం చేసుకుంటున్నాను. ఆయనకిక వేరే మార్గాంతరం లేదు. తన మరణం తర్వాత ఏం జరుగనుందో ఆయనకు తెలిసివుండవచ్చు (నా ఊహ). తన మరణం తర్వాత ఈ ప్రభుత్వానికి కొమింటాంగ్ ప్రభుత్వానికి పెద్ద తేడా వుండకపోవచ్చని ఆయన ఊహించివుండవచ్చు. ఈ ఆలోచనే ఆయనను ఈ ప్రయోగం చేయడానికి, సమాజంలో వున్న చీకటిని క్రింద నుండి (Bottom upto) వెల్లడి చేయడానికి ప్రజలను పురిగొల్పి వుండవచ్చు. మనం అక్కడో, ఇక్కడో ఉద్యమాలతో ఏ సమస్యలనూ పరిష్కరించలేము. క్రిందిస్థాయి నుండీ ప్రజలను సమీకరించి మన చీకటి కోణాన్ని వెల్లడి చేయగలిగినప్పుడే మన సమస్యలు పరిష్కారమవుతాయని మావో అంటుండేవారు. అది ఈ క్రింది నుండి పైకి పద్ధతిలోనే ఎందుకుండాలి? దీనికి కారణమేమంటే ఆయన విప్లవ జ్వాలను, తిరుగుబాటు తత్వాన్ని ఎప్పుడూ సజీవంగా వుంచడానికని నేననుకుంటున్నాను. నా అభిప్రాయంలో చైనా కమ్యూనిస్టు పార్టీ యొక్క నిజమైన చారిత్రక కర్తవ్యం యిందులోనే వుంది. ప్రజలు స్ఫూర్తిదాయకంగా నిలబడగలిగేవిధంగా చెయ్యడమే యిది. ఇదే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం.

**యాన్ :** అంటే సాంస్కృతిక విప్లవాన్ని రెండు దొంతరల్లో అర్థం చేసుకోవాలని మీరు భావిస్తున్నారన్నమాట. పై స్థాయిలో ప్రస్తుత ప్రపంచవ్యవస్థలో ఏ మార్గాన్ని ఎంచుకోవాలనేది కాగా, క్షేత్రస్థాయిలో – అసమానతలు, ప్రత్యేక సదుపాయాల అంశాలతో ఏవిధంగా వ్యవహరించాలనేదాన్ని ప్రజలు ఎదుర్కొన్నారు. ప్రజలు తమ గొంతుకను ఎలా కాపాడుకోవాలి? పెట్టుబడిదారీ మార్గాన్ని వ్యతిరేకించడమేకాదు, సోషలిస్టు సంస్కృతిలో ఇప్పటికీ ప్రజల మధ్యవున్న వైరుధ్యాలుగా పరిగణింపబడుతున్న అంశాలపట్ల ఎలా వ్యవహరించాలి? అనే ప్రశ్నలను ఎదుర్కొన్నారు. కనుక, సాంస్కృతిక విప్లవం పైస్థాయిలో పంథాల గురించిన సంఘర్షణను, క్రిందిస్థాయిలో సామాజిక ఆందోళనలను అనుసంధానం చేయడంలో విఫలమైందా?

**కావో :** వీటి మధ్య సంబంధం లేదు.

**యాన్ :** అత్యధికులు మొత్తం సాంస్కృతిక విప్లవాన్ని వారు పొందిన లాభనష్టాల ప్రాతిపదికనే వీక్షిస్తున్నప్పటికీ ఈ ఉద్యమంపట్ల మీ స్వీయ అవగాహనలో ఏవిధంగా మార్పు వచ్చింది? మీరు పేర్కొన్నారు... సాంస్కృతిక విప్లవ కాలంలోగానీ లేక తర్వాత వెనువెంటనేగానీ ఇది ఒక సాధారణ లక్షణంగా వుందా?

**కావో :** నాతోసహా గతంలో అందరికీ అది విస్తృతంగా వ్యాప్తి చెందిన లక్షణం. మేధావులు తరచుగా చెప్పడానికి యిష్టపడే విషయం ఏంటంటే – "మేము కేవలం సామాన్య ప్రజలం. మేము తక్షణ అవసరాల కోసమే చూస్తాము. మా గురించి మాత్రమే జాగ్రత్త తీసుకోగలం". సామాన్య ప్రజలను ఒక సాకుగా ఉపయోగించుకుంటారు. తమను తాము తగ్గించుకునే దృష్టికోణం నుండే విషయాలను వీక్షిస్తారు. ఈవిధంగా వారు ఒకవైపు చరిత్రను తమకొచ్చిన లాభనష్టాల నుండే బేరీజు వేస్తుంటారు. మరోవైపు మొత్తం విషయంలో వారు తమ చేతులకు మట్టికాకుండా సాంస్కృతిక విప్లవంలోని తప్పులన్నీ విప్లవ నాయకత్వంపై వేస్తారు. ఇదీ వీళ్ళు నిద్ర నటించే పద్ధతి. ఇతరులపై నైతిక బాధ్యతలను చూపించి తమ స్థానాలను పదిలం చేసుకోవాలనుకునేవారు స్వతంత్ర నైతిక వ్యక్తులుగా చెప్పుకోడానికి తగరు. దీన్ని ప్రజలలో నిజమైన స్వేచ్ఛగా ఎలా పరిగణిస్తారు?

**యాన్ :** ఈ నవలలో ఒక యువతి తిరుగుబాటుదారురాలుగా వుంది. మీ కథా రచనలో స్త్రీ అనే అంశాన్ని కీలకంగా తీసుకోడానికా లేక అవసరార్థం ఆ పాత్రను సృష్టించారా?

**కావో :** రెండు కారణాలు వున్నాయి. రచనను ఇది ఆసక్తిదాయకంగానూ చదివించేదిగానూ చేస్తుంది. విప్లవ సారంతో సంబంధం పెట్టుకోడానికి మహిళలకు తేలిగ్గా వుంటుంది. ఒక దేశంలోని మహిళల స్థితిగతులు, వారి స్థాయి ఆధారంగా ఆ దేశ నాగరికతల యొక్క మంచి చెడులను నిర్ణయించవచ్చు అనే ఒకనానుడి వుంది. చైనాలో మహిళల సామాజిక అంతస్థులో వచ్చిన అభివృద్ధే చైనా విప్లవ ఫలితాల్లో మిగిలివున్న అంశం. ఇటీవల ఒక నాటకాన్ని చూడడానికి నేను బీజింగ్ వెళ్ళినపుడు చాలామంది పిహెచ్‌డిలను కలిశాను. ఒకరు సమర్పించిన రిపోర్టు ప్రకారం చైనాలో గత అరవై సంవత్సరాలుగా అనేక సామాజికవర్గాల పాత్రలలో పెద్ద మార్పు రాలేదని ఆ పిహెచ్‌డిలు అన్నారు. అధికారుల కొడుకులు, కూతుళ్ళు అధికారులయ్యారు. పెట్టుబడిదారుల సంతతి పెట్టుబడిదారులయ్యారు. మేధావుల సంతానం మేధావులయ్యారు. గణాంకాల ఆధారంగా సమాజం మారలేదని ఈ నిర్ధారణకు వచ్చివుంటే అది సరైంది కాదని నేనంటాను. కనీసం రెండు పెద్ద మార్పులు యిక్కడ సంభవించాయి. మొదటిది మహిళల స్థాయి పెంపొందించబడింది. రెండవది వీరిలో అక్షరాస్యత బాగా పెరిగింది. మహిళల స్థాయి పెరుగుదలకు చైనా విప్లవమే కారణం. దీనిని ఎవరూ నిరాకరించలేని విషయం. ఈ పుస్తకంలో క్సియావోమింగ్ మరియు ఆమె తల్లిని పోల్చాను. ఇద్దరూ అన్యాయానికి గురై బాధలు పడ్డారు. ఇద్దరి జీవితాలలోను కష్టాలు, కడగండ్లున్నాయి. కాని వారి జీవితంపట్ల వారి దృక్పథాలు భిన్నంగా వున్నాయి. తల్లి పూర్తిగా సాంప్రదాయ విద్యను పొందింది. ఆమె పునర్జన్మలో మనిషిగా గాకుండా జంతువుగా పుట్టాలని చివరి కోరికను కోరుకుంది. క్సియావోమింగ్ కూడా అనేక ఆటుపోట్లను ఎదుర్కొంది. కాని సాంస్కృతిక విప్లవ కాలంలో తిరుగుబాటుదారులుగా ముందు కొచ్చింది. ఈ ప్రపంచంలో తనుకూడా ప్రముఖపాత్రను పోషించాలనుకోవడమే దీనికి కారణం. వీరిద్దరివీ పూర్తిగా భిన్నమైన దృక్పథాలు. పోరాటాల మధ్య స్త్రీ తన స్థానాన్ని సాధించుకుంది. దాన్నెవరూ ఒక బహుమానంగా అందించలేదు.

**యాన్ :** చాలా బాగుంది. రీసెర్చ్ వర్కర్స్ ఉద్యమంలోని నా స్నేహితులు కొందరు 1990 దశకం రెండవ అర్ధభాగంలో ఫాక్టరీలలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో మహిళలు కీలకపాత్ర వహించారని పరిశీలనలో తేలిందన్నారు.

**కావో :** ఈ విధమైన అభివృద్ధిని అనేకరంగాల్లో చూడవచ్చు. క్రీడల్లో యిది బాగా కన్పిస్తుంది. కళారంగంలో కూడా. కొందరు మహిళలు పురుషుల కంటే మెరుగైనస్థాయి ఆలోచనా విధానం కలిగి వున్నారు. పురుషులకంటే ఎక్కువమంది మహిళలు డాక్టరేట్ చేస్తున్నారు. దీనివల్ల మంచి భవిష్యత్తు వుందని భావిస్తున్నారు. చైనా విప్లవ ప్రభావం ఏవిధంగా వుందో ఈ విషయం తెలియచేస్తుంది. మీరు దక్షిణకొరియా గాని జపాన్‌గాని సందర్శిస్తే అక్కడ మహిళల పరిస్థితి చైనా మహిళల కంటే భిన్నంగా వుందని గమనించవచ్చును. నా పాఠశాలలోని చాలామంది ఉపాధ్యాయులు మార్పిడి విధానంపై దక్షిణకొరియా వెళ్ళివచ్చారు.

అక్కడి మహిళా ఉపాధ్యాయులు ఆత్మవిశ్వాసంతో వుంటున్నారనీ, క్లాసు తీసుకుంటున్నపుడు సజీవంగా, చైతన్యవంతంగా వుంటున్నారనీ, కాని క్లాసు ముగిసినట్లు గంట కొట్టగానే వినయ విధేయలతో కూడి ఒదిగివుంటూ, క్లాసుకెళ్లబోయే ముందు స్థితికి మారిపోతున్నారన్నారనీ తిరిగి వచ్చింతర్వాత వారు చెప్పారు. వాస్తవానికి వారు చైనాపట్ల అసూయగా వున్నారు. ✡

# వివిధ దేశాలలో కార్మికుల ఆందోళనలు

## బంగ్లాదేశ్

బంగ్లాదేశ్‌లోని దుస్తుల తయారీ పరిశ్రమ కార్మికులు నికృష్టమైన తమ వేతనాలను కనీస వేతనాల స్థాయికైనా పెంచాలని డిమాండ్‌చేస్తూ నిరవధికంగా ఆందోళన చేపట్టారు. బంగ్లాదేశ్ దుస్తుల పరిశ్రమలో కనీసం 40 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రపంచంలో దుస్తుల తయారీ, ఎగుమతి రంగంలో ఈ దేశం రెండవ స్థానంలో వుంది. ఈ కార్మికులలో 80 శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు వున్నారు. 2013 సెప్టెంబరులో వీరంతా కలిసి అనేక ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం వీరి సమస్యలను పరిష్కరించటానికి బదులుగా కార్మికులపై లాఠీలు, రబ్బరు బుల్లెట్ల ప్రయోగం, భాష్పవాయు ప్రయోగం తదితర రూపాలలో తీవ్రమైన పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించింది.

ఈ నిరసనలు తీవ్రమై, ఆందోళనకారుల సంఖ్య క్రమంగా పెరిగిపోయి 2013 నవంబర్ 11న వేలాదిమంది కార్మికులు సమీకృతులై ప్రధాన రహదారులను దిగ్బంధంచేసి నిరవధికంగా రాకపోకలను నిరోధించారు.

దుస్తుల తయారీ కార్మికుల కనీస వేతనాల నిర్ధారణకై ప్రభుత్వం నియమించిన ఆర్గురు సభ్యులతోకూడిన బృందం 5300 టాకాలను కనీసవేతనంగా నిర్ణయించింది. కానీ కార్మికులు, 8114 టాకాలను కనీసవేతనంగా డిమాండ్ చేస్తున్నారు. వారు ప్రభుత్వబృంద నిర్ణయాన్ని వ్యతిరేకించారు. పోలీసులతో తోపులాటకు సిద్ధమయ్యారు. ఈ నిరసనలను సాకుగాచూపి అఘులియా ప్రాంతంలోని 200 దుస్తుల తయారీ పరిశ్రమలను మూతవేశారు.

2013 నవంబరు 2న గజిపూర్‌కు చెందిన కార్మికులు మల్టిఫ్యాబ్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ఎదురుగా ధర్నా చేశారు. గజిపూర్ కార్మికులతో సమానంగా తమకు కూడా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలోని మరో మూడు పరిశ్రమల కార్మికులు వీరి ఆందోళనలో కలిశారు. ఆందోళన చేస్తున్న కార్మికులపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడి, భాష్పవాయు గోళాలను ప్రయోగించారు.

జనవరి 1వ తేదీన గజిపూర్ పారిశ్రామిక మండలిలోని ఖుదార్ సింథటిక్ పరిశ్రమ కార్మికులు, తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పరిశ్రమ వెలుపల ఆందోళన చేపట్టారు.

సెంట్రల్ పారాగ్రానైట్ మైనింగ్ కంపెనీ అనే ప్రభుత్వరంగ గనులలో పనిచేసే గని కార్మికులు నవంబర్ 25 నుండి 20 శాతం డి.ఏ.ను పెంచాలని, కార్మికుల తొలగింపును ఆపివేయాలనీ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను నిలిపివేయాలని, తొలగించిన 8 మంది గనికార్మికులను పనిలోకి తీసుకోవాలని, డిప్లొమా ఇంజనీర్ల ఉద్యోగ నియంత్రణ కల్పించాలని డిమాండ్‌చేస్తూ సమ్మె చేపట్టారు.

## కెన్యా

కజిడో కౌంటీలోని స్వేచ్ఛా వ్యాపార మండలిలోనున్న న్యూ వైడ్ గార్మెంట్స్ కంపెనీ కార్మికులు ఆరువేలమంది జనవరి 7 నుండి సమ్మెలోకి వెళ్ళారు. జబ్బుపడినవారికి హక్కుగా చెల్లించాల్సిన వేతనాన్ని యాజమాన్యం చెల్లించనందుకు, గాయపడిన కార్మికులకు పరిహారం చెల్లించనందుకు, అదనపు పనిగంటలకు అధికవేతనాన్ని చెల్లించనందుకుగానూ వీరంతా ఈ ఆందోళనకు పూనుకున్నారు. అంతేగాక, మేనేజర్ల స్థాయిలోని అధికారులు జూనియర్ సిబ్బందిని దూషిస్తూ, అసభ్యపదజాలంతో అవమానించటాన్ని; కంపెనీ యాజమాన్యం, కార్మికుల వేతనాల నుండి కోతబెట్టి తమ వద్ద నిల్వవుంచిన యూనియన్ బకాయిలను-కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా-చెల్లించకపోవటాన్ని నిరసిస్తూ వారు ఆందోళనను కొనసాగించారు.

## కంబోడియా

సింగపూర్‌కు చెందిన యస్ఎల్ గార్మెంట్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని 2013 సెప్టెంబరు 20 నుండి లాకౌట్ చేశారు. ఆగస్టులో నాలుగువేల మంది కార్మికులు... 70 మంది తమ తోటి కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఆందోళనకు పూనుకోగా యాజమాన్యం ఈ చర్యకు పూనుకుంది. వేతనాల పెంపుదలను కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. నవంబర్ చివరివారంనుండి ఈ కార్మికులు తమ ఆందోళనను కొనసాగించారు. 19మంది కార్మిక యూనియన్ ప్రతినిధులను తిరిగి పనిలోచేర్చుకోవాలనే కోర్టు ఆదేశాలనుకూడా యాజమాన్యం ఖాతరు చేయలేదు.

2013 నవంబర్ 19న దక్షిణ కొరియాకు చెందిన ఆలిమ్ కంబోడియా ఫ్యాక్టరీలోని 100 మందికిపైగా సమ్మె చేస్తున్న కార్మికులు ఫినామినాలోని సిటీ హాల్ వద్దకు ప్రదర్శన నిర్వహించారు. నలుగురు మేనేజర్లను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల అనేకానేక సమస్యల పరిష్కారాన్ని డిమాండ్‌చేస్తూ 400 మంది కార్మికులు అప్పటికి రెండువారాలపైగా సమ్మె చేస్తున్నారు.

కంబోడియాలో షుమారు 6,50,000 మంది దుస్తుల కంపెనీలో పనిచేస్తున్నారు. దేశంలోకి విదేశీ ఆదాయం వచ్చేందుకు ఇదొక ప్రధాన వనరుగా వుంది. వేతనాలపై, భద్రతా చర్యలపై సమస్యలు కంబోడియాలో చాలా సాధారణంగా వున్నాయి. వందల కోట్ల డాలర్ల ఈ దుస్తుల పరిశ్రమలో గ్యాప్, నైక్, హెచ్ అండ్ ఎమ్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులు తయారవుతాయి.

కార్మికుల వేతనాలు అతితక్కువగా వున్నాయి. నెలవారీగా 160 డాలర్ల వేతనం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఐదువందల ఫ్యాక్టరీలకు చెందిన కార్మికులంతా 2013 డిసెంబర్ 24 నుండి సమ్మెలోకి వెళ్ళారు. 3 లక్షల మంది మొత్తంగా ఈ సమ్మెలో పాల్గొన్నారు.

కానీ ప్రభుత్వం సైనికులను రంగంలోకి దించి, ఆందోళనచేస్తున్న కార్మికులపై నిర్బంధం ప్రయోగించింది. కార్మికులు వీరితో పెనుగులాడారు. సైన్యం కార్మికులపై లాఠీఛార్జికి పాల్పడటమేగాక, కార్మికులపై కాల్పులు సాగించి ముగ్గురు కార్మికుల ప్రాణాలను బలిగొంది. 20 మందికిపైగా కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.

జనవరి 14న 12,500 మంది కార్మికులు ఫినామినాతోసహా ఫ్యాక్టరీలన్నింటి వద్దా పనులను జరగనీయకుండా అడ్డుకున్నారు.

## దక్షిణాఫ్రికా

2013 సెప్టెంబర్ 3న 80వేల మంది బంగారు గనుల కార్మికులు వేతనాల పెంపుదలను డిమాండ్‌చేస్తూ సమ్మెలోకి వెళ్ళారు. ది నేషనల్ యూనియన్ ఆఫ్ మైన్స్ ఈ సమ్మెను నిర్వహించింది.

జొండేరైండేలోని నార్దమ్‌కు చెందిన ప్లాటినమ్ గనిలో కార్మికులు 2013 నవంబర్ 3వ వారం నుండి సమ్మెలోకి వెళ్ళారు. వారి వేతనాల పెరుగుదలను, వారి జీవన ప్రమాణ పెరుగుదలకోసం భృతి పెంపును వారు డిమాండ్ చేశారు.

2014 జనవరి 23న వజ్రాల గనుల తవ్వకం కార్మికులు సమ్మెచేశారు. వీరు తమ వేతనాల పెరుగుదలను డిమాండ్‌చేశారు. ప్రపంచ ప్రసిద్ధిచెందిన దక్షిణాఫ్రికాలోని మూడు గనులలో పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు.

## నమీబియా

కైబాబ్ వద్దనున్న పలు పరిశ్రమలో పనిచేసే బంగారు గని కార్మికులు 2014 జనవరి మొదటివారంలో సమ్మెచేశారు. సాంవత్సరిక బోనస్‌ను వారు డిమాండ్‌చేశారు.

## అమెరికా

అమెరికా దేశవ్యాపితంగా పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులంతా 15 నగరాలలో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. వారి దుర్భర పరిస్థితులను నిరసిస్తూ వారు ఈ కార్యక్రమం చేపట్టారు. శిక్షలకు గురిచేసిన లేదా వివిధ కారణాలతో తొలగించిన ఉద్యోగులు లేదా కార్మికులందరినీ తిరిగి పనిలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. న్యూయార్క్ నగరంలో జరిగిన ప్రదర్శన సందర్భంగా పోలీసులు పెద్దసంఖ్యలో కార్మికులను ఉద్యోగులను అరెస్టు చేశారు.

సెయింట్‌పాల్ మెన్నెసోటాలో నవంబర్ 29న వందలాదిమంది నిరసనకారులు తక్కువ వేతనాలు, దుర్భర పని పరిస్థితులను నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. వీరంతా అతిపెద్ద రీటైల్ దిగ్గజం వాల్-మార్ట్‌లో పనిచేసేవారే. రహదారులను దిగ్బంధించిన వారిలో 26 మంది కార్మికులను పోలీసులు అరెస్టుచేశారు. నిరసనకారులు వాల్‌మార్ట్ దుకాణ సముదాయాల వద్ద కార్యక్రమాలు నిర్వహించారు.

తమ వేతానాలలో పెంపుని డిమాండ్‌చేస్తూ వేలాదిమంది ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పనిచేసే కార్మికులు అమెరికా దేశవ్యాపితంగా భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. డిసెంబర్ 7న దేశంలోని వంద నగరాలలో ఈ కార్యక్రమాలను చేపట్టి తమ డిమాండ్‌ను ఎలుగెత్తి చాటారు.

## గ్రీస్

ప్రభుత్వ ప్రసార సంస్థ ఇఆర్‌టి ఉద్యోగులంతా, ఐదు నెలల క్రితం హటాత్తుగా దీనిని మూసివేతకు గురిచేసినప్పటి నుండీ ఇక్కడే బైఠాయింపు జరిపి తమ మొక్కవోని దీక్షను తెలియపరిచారు. నవంబర్ 7న పోలీసులు రంగప్రవేశం చేసి ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని బైఠాయింపు జరుపుతున్న కార్మికులను, ఉద్యోగులను అక్కడ నుండి బలవంతంగా తొలగించివేశారు.

## శ్రీలంక

శ్రీలంక బియాగమా ఫ్రీట్రేడ్ జోన్‌లోని ఆస్ట్రేలియాకు చెందిన బహుళజాతి రబ్బరు తయారీ పరిశ్రమ కార్మికులు వేయిమంది ఆన్‌సెల్ లంక వద్ద అక్టోబర్ 11 నుండి సమ్మె చేస్తున్నారు. వీరంతా యూనియన్ అధ్యక్షుడితోసహా తొలగించబడిన తమ కార్మికులు 11 మందిని వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కంపెనీ యాజమాన్యం - కార్మికుల ఉత్పత్తి లక్ష్యాలను పెంపొందిస్తూ, కాంట్రాక్టు పనివారలను చేర్చుకుంటున్నది. శ్రీలంక స్వేచ్ఛా వాణిజ్య మండలి ఏర్పాటు తదనంతరం అత్యధిక కాలం సాగింది ఈ సమ్మె మాత్రమే. నవంబర్ 20న, వందలాదిమంది ఆందోళనకారులు కొలంబోలోని ఆస్ట్రేలియా దౌత్యకార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, వారి సమస్యలను పరిష్కరించటంలో తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## ఆస్ట్రేలియా

దాదాపు 900 మంది నిర్మాణరంగ పనివారు దక్షిణ ఆస్ట్రేలియాలోని రాజధానీ నగరం రాయల్ అడిలైడ్ హాస్పిటల్ ప్రదేశం నుండి నవంబర్ 22న పనుల్లోకి రాకుండా ఆగిపోయారు. ఈ మధ్యకాలంలో వరుసగా జరుగుతూ వస్తున్న మూడవ క్రేన్ దుర్ఘటన తదనంతరం వారు ఈ చర్య తీసుకున్నారు. హాన్‌సేన్ యాంకాన్ మరియు లైటాన్ కాంట్రాక్టరు ఆ నిర్మాణరంగ కంపెనీ నడుపుతున్నాడు. పని ప్రదేశంలో రక్షణ లేనందుకు వారంతా 3రోజులపాటు పనులకు వెళ్ళకుండా నిరసన తెలిపారు. ఆస్ట్రేలియా ఉత్తర భూభాగంలోని ప్రభుత్వ విద్యాసంస్థల ఉపాధ్యాయులు నవంబర్ 7న నాలుగు గంటల సమ్మె నిర్వహించారు. నూతన పని ఒప్పందాన్ని నిరసించే ప్రచారంలో భాగంగా వారు ఈ కార్యక్రమం చేపట్టారు. నవంబర్ 19న వివిధ ప్రాంతీయ కేంద్రాలలోనూ ఇదేవిధంగా నాలుగు గంటల పని నిలుపుదల చేశారు.

ఉపాధ్యాయ పోస్టులలో కోత విధించటాన్ని, తరగతి గదిలో విద్యార్థుల సంఖ్యను పెంచటాన్నీ వీరు నిరసిస్తున్నారు. ప్రభుత్వం 3వేలమంది ఉపాధ్యాయులను తొలగించాలని పథక రచన చేసింది.

## కెనడా

నవంబర్ 7న హాలిఫాక్స్, నోవాస్కోటియాలలోని ఇర్వింగ్ షిపియార్డులో పనిచేసే దాదాపు 300 మంది కార్మికులు పని నుండి వైదొలిగారు. తమ తోటి కార్మికుని ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను వారు నిరసించారు. అతను యాజమాన్యం చేతిలో వేధింపులకు గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాజమాన్య భద్రతా తనిఖీలను ప్రశ్నించినందుకుగాను క్రమశిక్షణాచర్య పేరున వేతన చెల్లింపులేని నెలకాలపు సస్పెన్షన్ ఉత్తర్వునందుకొన్న మరునాడే మెకన్‌జీ అనే కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## న్యూగినియా

ఎంగా రాష్ట్రంలోని బారక్ గోల్డ్‌కు చెందిన పొర్గెరా బంగారు గనిలో పనిచేసే 300 మంది కార్మికుల నిరసనపై పాపువా న్యూగినియా పోలీసు అధికారులు డిసెంబర్ 4న తుపాకులెక్కుపెట్టి కాల్పులు సాగించి కనీసం ఆరుగురు కార్మికులను కాల్చిచంపారు. అనేకమందిని తీవ్రంగా గాయపరిచారు. స్థానిక గని కార్మికులు, గ్రామస్థులతో కలసి వాతావరణ కాలుష్యానికి, అమానవీయ పని పరిస్థితులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఒక దశాబ్దకాలంగా పిజెవి రక్షణబలగాలు అత్యాచారాలు, దాడులు, హత్యలు సాగిస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

## దక్షిణ కొరియా

దక్షిణ కొరియా ప్రభుత్వ ఆధ్వర్యంలోని రైల్వే వ్యవస్థ కొరియాక్‌లో పనిచేసే మూడవవంతు అనగా 8వేల మంది కార్మికులు డిసెంబర్ 9 నుండి సమ్మెచేశారు. ప్రైవేటీకరణపై చెలరేగిన వివాదం ఈ సమ్మెకు కారణం. నూతనంగా ప్రవేశపెట్టిన కెటిఎల్స్ అనే బుల్లెట్‌ట్రైన్‌ను ప్రైవేటు ఆపరేటర్ ద్వారా నడపాలనే యాజమాన్య నిర్ణయం ప్రైవేటీకరణకు దారితీయనుండటంతో కార్మికులు ఈ సమ్మెచేశారు.

## జర్మనీ

ఇంటర్‌నెట్ సంస్థ అమెజాన్ ఉద్యోగులు డిసెంబర్ 16 నుండి సమ్మెచేశారు. జర్మనీలో ఈ సంస్థకు 9వేలమంది కార్మికులున్నారు. యాజమాన్యం వారిపై నిరంతర నియంత్రణ సాగించటం వంటి చర్యలను, అవాస్తవిక పనిప్రదేశ లక్ష్యాలను నిరసిస్తూ వారు సమ్మెలోకి వెళ్ళారు. యాజమాన్యం విధించిన పని పరిస్థితులు వుద్యోగులకు మానసిక అశాంతినేగాక భౌతిక అనారోగ్యాన్ని కల్గిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

## ఫ్రాన్స్

ఫ్రెంచ్ రైల్వే యూనియన్లు డిసెంబర్ 12న దేశ వ్యాపితంగా 36 గంటల సమ్మెను చేపట్టాయి. రైల్వే వ్యవస్థను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ సంస్కరణల విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈ యూనియన్లు అన్నీ ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి.

## స్పెయిన్

మాడ్రిడ్‌లో డిసెంబర్ 14న సుమారు 3వేల మంది కార్మికులు ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రజాసేవలలో ప్రభుత్వం కోతలు విధించటాన్ని నిరసిస్తూ స్పెయిన్ పార్లమెంటు ఎదుట ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పొదుపు చర్యలను నిరసించే ఈ ఆందోళనకారులలో 7గురిని ప్రభుత్వం అరెస్టుచేసింది. పోలీసుల లాఠీఛార్జిలో 23మంది గాయపడ్డారు.

## ఈజిప్టు

ఈజిప్టు ఇనుము మరియు ఉక్కు కంపెనీ కార్మికులు డిసెంబర్ 15న మంత్రిమండలి ఎదుట తమ నిరసనను వ్యక్తంచేశారు. ఫ్యాక్టరీలో తొలగించబడిన కార్మికులను తిరిగి పనిలోకి తీసుకురావాలని, పని నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలని, లాభాలలో గత 16 నెలలుగా కార్మికుల వాటాను చెల్లించాలనే వివిధ సమస్యలను వారు ఈ సందర్భంగా ప్రభుత్వం ముందుంచారు. ఫ్యాక్టరీ అత్యున్నతస్థాయి అధికారులను తొలగించాలని కూడా వీరు డిమాండ్ చేశారు. **(తరువాయి 6వ పేజీలో)**

# ‘నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయ ప్రచార కృషిని విస్తృతంగా సాగించండి’

## సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి ఆధ్వర్యంలో జరిగిన సభలో కేంద్ర నాయకుల ఉద్ఘాటన



సభలో ప్రసంగిస్తున్న కామ్రేడ్స్ గుర్రం విజయ్‌కుమార్, సుబ్రతోబసు, అరవింద సిన్హా, అలోక్ ముఖర్జీ, జస్వంతరావు; సభకు హాజరైన ప్రజలు మరియు పార్టీశ్రేణులు

**విజయవాడ, 3-3-14:**

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి ఆధ్వర్యంలో **దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై** స్థానిక హనుమంతరాయ గ్రంథాలయంలో సభ జరిగింది. ఈ సభలో తొలుత వక్తలను పార్టీ రాష్ట్రకమిటి సభ్యులు కా॥కె.కోటయ్య ఆహ్వానించగా, **పార్టీ కేంద్రనాయకులు కా॥ గుర్రం విజయకుమార్** ఈ సభకు అధ్యక్షత వహించారు.

ఇటీవల కాలంలో...ప్రపంచ దేశాలలోనూ, మన దేశంలోనూ శ్రామికవర్గ విముక్తికోసం ప్రాణాలర్పించిన, పీడిత ప్రజాఉద్యమాలలో ప్రజాస్వామిక ఉద్యమాలలో కృషిసల్పుతూ మరణించిన వారందరికీ సిపిఐ(ఎం.ఎల్) కేంద్రకమిటి తరపున జోహార్లర్పించారు. ఆయన తన అధ్యక్షోపన్యాసంలో ప్రపంచ చరిత్రలో వర్గసంఘర్షణ అనివార్యమని పేర్కొన్నారు. భారత దేశ చరిత్రలో ప్రస్తుత పరిణామాల గురించి విశ్లేషిస్తూ పాలకవర్గ ముఠాలే వైరి వర్గాల పాత్రను పోషిస్తూ ప్రజల్ని వంచిస్తున్నాయన్నారు. సంక్లిష్టమైన, విచిత్రమైన భారత ప్రస్తుత రాజకీయ పరిణామాల నడుమ పార్టీ అవగాహనను స్పష్టంగా మరోమారు ప్రజల ముందుంచేందుకే ఈ సభను నిర్వహిస్తున్నామని చెప్పారు.

**సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర నాయకులు కా॥సుబ్రతోబసు** మాట్లాడుతూ అత్యంత దుర్భరమైన ప్రజల జీవన పరిస్థితుల నడుమ 16వ లోక్‌సభకు ఎన్నికలు జరగబోతున్నాయన్నారు. ‘47 తర్వాత రెండు దశాబ్దాలపాటు నిరాటంకంగా పాలించిన కాంగ్రెస్‌పార్టీ 1967 ఎన్నికలలో 9 రాష్ట్రాలలో పరాజయం పాలైంది. ఈ పరిస్థితులలో ప్రజావ్యతిరేకతనుండి బయట పడేందుకు గరీబీ హటావో, 20 సూత్రాల పథకం వంటి పథకాలను కాంగ్రెస్‌పార్టీ ముందుకు తెచ్చింది; ఎమర్జెన్సీ విధించింది. కాంగ్రెస్‌పార్టీ వాగ్దానాలు బూటకమైనవిగా గుర్తించిన ప్రజలు కాంగ్రెసును ‘77లో ఓటమికి గురిచేశారు. 1990ల తదనంతర కాలంలో పాలకులు ప్రపంచీకరణ విధానాలను ముందుకు తెచ్చారు. ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం కూడా ఇదే విధానాలను అమలుచేస్తూవచ్చింది. ప్రజలు కోరుకున్న మార్పులేవీ ఈ ఎన్నికలద్వారా సాధ్యం కాలేదు. 2004 ఎన్నికలలో బిజెపి ‘ఇండియా ప్రకాశిస్తోంద’నే నినాదంతో ప్రజలను మోసగించే ప్రయత్నం చేసింది. కానీ, ప్రజలు దీనిని విశ్వసించలేదు. ఎన్నికలలో వాజ్‌పేయి ప్రభుత్వాన్ని ఓడించారు. కానీ ప్రతిసారీ ప్రజలు ద్రోహం చేయబడుతున్నారు. 2004 సాధారణ ఎన్నికల తర్వాత నాలుగు వామపక్షపార్టీలు కాంగ్రెస్‌తో కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించాయి. ఇది, ప్రజలపై దాడిని కప్పిపుచ్చటానికి సరికొత్త ముసుగుఅని కా॥కానుసన్యాల్ నాయకత్వంలోని సిపిఐ(ఎం-ఎల్) ఆనాడే ప్రకటించింది. 2009 ఎన్నికల్లోనూ తిరిగి యుపిఏ కూటమి అధికారంలోకి వచ్చింది.

మనదేశంలోని శ్రమజీవులందరిముందు ఒక ఆందోళనకర పరిస్థితి వుంది. పశ్చిమబెంగాల్లో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలోని వామపక్ష సంఘటన ప్రభుత్వం 1977 నుండి 2011 వరకు నిరంతరాయంగా అధికారంలో కొనసాగింది. మొదటి 10-15 సం॥కాలం ప్రజల బాధలు కనీసంగా నివారించి, ఉపశమనం కలిగించేటువంటి పాలన చేపట్టింది. 1991లో ప్రపంచీకరణ విధానాలతో వామపక్ష సంఘటన పాలకులు ‘అగ్రికల్చర్ ఈజ్ బెస్ట్...ఇండస్ట్రీ ఈజ్ ఫ్యూచర్’ అనే నినాదాన్ని అందుకున్నారు. ఐనా ప్రజల జీవితాలలో అభివృద్ధి లేదు. పశ్చిమబెంగాల్లోని ఈ అనుభవం ప్రస్తుత సామాజిక వ్యవస్థలో ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం ఏ ప్రభుత్వం ద్వారానూ సాధ్యంగాదని స్పష్టమైంది. తిరిగి ‘ఫైర్‌బ్రాండ్’గా పేరుగాంచిన మమతాబెనర్జీ ‘పరిపాలనలో పరివర్తన-అభివృద్ధి’ నినాదంతో ముందుకొచ్చింది. అప్పటిదాకా అధికారంలోనున్న వామపక్ష సంఘటనను అధికారం నుండి తొలగించి తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

ఈ పరిణామాల నేపథ్యంలో సామ్రాజ్యవాదానికి, భూస్వామ్యవిధానానికి, కార్పొరేటు శక్తులకు దాసోహం చేస్తున్న ఈ వ్యవస్థ మార్పుకై ప్రజలను సమీకరించి సంఘటితపరచవలసిందిగా సిపిఐ (ఎం.ఎల్) కేంద్రకమిటి పిలుపునిస్తోంద’ని చెపుతూ కామ్రేడ్ సుబ్రతోబసు తన ఉపన్యాసం ముగించారు.

**సిపిఐ(ఎం.ఎల్) కేంద్ర నాయకులు కా॥అరవింద సిన్హా** మాట్లాడుతూ గత ఆరున్నర దశాబ్దాల పార్లమెంటరీ పాలనను పరిశీలిస్తే దాని దివాళాకోరుతనం స్పష్టమౌతుందన్నారు. ప్రస్తుత సాధారణ ఎన్నికల తీరుతెన్నులపై ఆయన మాట్లాడుతూ ఒక సం॥కాలం ముందుగానే పాలకపార్టీలు 2013 నుండే ఎన్నికల ప్రచారం ప్రారంభించాయన్నారు.

బిజెపి తమ ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీని ప్రకటించింది. వారు మోడీని వికాశపురుష్‌గా కొనియాడుతున్నారు. మొదటిసారిగా విదేశీ కిరాయి ఏజన్సీలద్వారా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఎలక్ట్రానిక్ మాధ్యమాలు గత రెండు నెలలుగా మోడీ బహిరంగసభల ప్రత్యక్ష ప్రసారాలను అందిస్తున్నాయి. ఒక వ్యక్తిని మహాపురుషునిగా చిత్రీకరించటానికి బిజెపి వెయ్యికోట్లు ఖర్చుపెడ్తున్నది. ‘కాంగ్రెస్ రహిత భారతదేశం’ అని మోడీ నినాదమిస్తున్నాడు. ఇది చాలా ఫాశిస్టు నినాదం. మరో పార్టీ ఉనికి లేకుండా చేయాలనుకునే ఈ వైఖరి చాలా ప్రమాదకరం. అమెరికాలో ఒక పార్టీలోనే ఆమోదయోగ్యమైన అభ్యర్థికోసం ప్రజాస్వామిక చర్చ సాగుతుంది. కానీ బిజెపి ఏవిధంగానూ తన పార్టీలో అంతర్గత విధానంద్వారా మోడీని ఎంపికచేయలేదు. నాగపూర్‌లో సమావేశమైన ఆర్‌ఎస్‌ఎస్, సంఘుపరివార్‌లు నరేంద్రమోడీని ప్రధాన అభ్యర్థిగా ప్రకటించమని బిజెపిపై వత్తిడి తెచ్చాయి. నరేంద్రమోడీ స్వయానా తన మంత్రి వర్గంలోని హోంమంత్రినే హత్య చేయించాడనే ఆరోపణలున్నాయి. అతని ప్రభుత్వ హయాంలో సాగిన పలు ఎన్‌కౌంటర్లపై ప్రత్యేక పరిశోధనా బృందం ఆధ్వర్యంలో విచారణలు జరుగుతున్నాయి. ఆతని ప్రభుత్వ కాలంలో ఉన్నత పోలీసు అధికారులుగా వున్న పదిమంది జైలులో వున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలమేరకే తాము ఆ చర్యలకు (ఎన్‌కౌంటర్లకు) పాల్పడ్డామని వారు బాహాటంగా ప్రకటించారు. ఇలాంటి వ్యక్తి భారతదేశం వంటి దేశాన్ని ధృడమైందిగా ఎలా మలచగలుగుతాడు? బిజెపీ సీనియర్ నాయకుడైన వాజ్‌పేయి ఓ బహిరంగ సభలో గుజరాత్ మారణకాండపై వ్యాఖ్యానిస్తూ ‘మోడీ రాజధర్మాన్ని విస్మరించాడని’ పేర్కొన్నాడు.

బౌద్ధం, జైనం, శిక్కు మతాలకు మనదేశం జన్మభూమి. వివిధ మతాలు-ఒకే మతంలో భిన్న పద్ధతులు, పాటింపులు వున్న ఈ దేశంలో మోడీ ఏవిధమైన పరిపాలన సాగించగలుగుతాడు? భారత ప్రజలు తరతరాలుగా నిర్మించుకుంటూవస్తున్న పరమత సహిష్ణుతనుకాలరాయటానికి మోడీ ప్రయత్నిస్తున్నాడు. ప్రజాస్వామిక, లౌకిక ఆలోచనలకు సరిపడని అభ్యర్థిగా మోడీ వుండగా, ఆర్‌ఎస్‌ఎస్, సంఘుపరివార్‌ల దృష్టిలో ఇతనో ధృడమైన అభ్యర్థిగా వున్నాడు. ఈ ఫాశిస్టు ధోరణులకు వ్యతిరేకంగా గొంతెత్తాలి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయనటం రాజ్యాంగానికే భిన్నమైంది. ఎన్నికలు మొదలుకాకుండానే వేలకోట్ల రూ॥లు ప్రచారంకోసం ఖర్చుచేశారు. ఇదంతా అభ్యర్థి ఎన్నికల ప్రచార ఖర్చులోకి రాదంటున్నారు. ఈ ప్రజాస్వామ్య బూటకత్వాన్ని వెల్లడిచేయాలి. సామాన్యుడు - ఆతని రాజకీయాలేవైనా-అతను ఎన్నికల్లో వాస్తవ అర్థంలో పోటీచేయలేడు; గెలవటం అసంభం. ఈ విధంగా మలచిన ఈ ఎన్నిక వ్యవస్థ యొక్క బండారం బయటపెట్టాలి.

బ్రిటిష్ వలసవాదులు అనుసరించిన విభజించు -పాలించు విధానాలనే నేటి పాలకులూ అమలు చేస్తున్నారు. కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రగిల్చి ప్రజల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. పార్లమెంటు, అసెంబ్లీలు బాతాఖానీ క్లబ్బులకంటే దిగజారాయనేది మరోసారి ఇటీవలే నిరూపితమైంది. ఈ రకమైన పార్లమెంటరీ వ్యవస్థపై ప్రజలు నమ్మకం పెట్టుకోవాల్సిన అవసరంలేదని, ఈ దేశవ్యవస్థను మార్చుకోవటానికి ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విప్లవకారులు ఐక్యంగా ఉద్యమించాల’ని కా॥అరవిందసిన్హా పిలుపునిచ్చారు.

**సిపిఐ(ఎం.ఎల్) కేంద్రనాయకులు కా॥అలోక్ ముఖర్జీ** మాట్లాడుతూ... సభ ప్రారంభంలో ప్రజాకళాకారులు ఆలపించిన ‘కమ్యూనిస్టులం...మేం కష్టజీవులమ’నే సుబ్బారావు పాణిగ్రాహి రచించిన గీతంలోని ‘దేశాలకు రాష్ట్రాలకు పరిమితమై ఉండబోము...సకల దేశ శ్రామికులం ఐక్యమై తీరుతాము’ అనే చరణాన్ని గుర్తుచేసి, అంతర్జాతీయ వాదులుగా కమ్యూనిస్టుల విశిష్టతను వివరించారు. ప్రపంచీకరణ తదనంతర కాలంలో మానవశ్రమశక్తిని మానవ ‘వనరులు’గా మార్చివేశారనీ, జీతాలు తగ్గించటాన్ని-ఖర్చులుకుదించటంగా పేర్కొంటున్నారని; ‘పింక్‌స్లిప్’ పంపితే ఉద్యోగంనుండి తొలగించినట్లేనని కొత్త దోపిడీరూపాలను, పారిభాషిక పదజాలాన్ని వల్లిస్తున్నారన్నారు. ‘మన దేశంలో బలహీన ప్రధానిగా మన్మోహన్‌సింగ్‌ను పేర్కొంటూ ధృడమైన ప్రధాని అభ్యర్థిగా మోడీని పేర్కొంటూ అందుకు ప్రేరణగా వల్లభాయిపటేల్‌ను ముందుపెట్టడం వెనుక అణచివేతను పెంపొందించాలనే ప్రయత్నం వుంది. మూడవ ఫ్రంట్‌గా ముందుకొస్తున్న దాని బూటకత్వాన్ని కూడా ఎండగట్టాలి. ప్రజల్ని రాజకీయంగా చైతన్యవంతంచేసి పోరాటంలోకి సమీకరించాలి. సిపిఐ(ఎం-ఎల్) అభ్యర్థులకు, ఇతర కమ్యూనిస్టు విప్లవకారుల, ప్రజాతంత్ర అభ్యర్థులకు మద్దతునివ్వాలి. నూతన ప్రజాతంత్ర విప్లవ సాధనలోకి ప్రజలను సమీకరించే కృషిలో భాగంగా ప్రచారకృషి సాగించాలి. తగిన అభ్యర్థులు లేనిచోట ‘నోటా’ మీటను నొక్కటం ద్వారా ప్రజల నిరసనను వ్యక్తంచేసే ఒక అవకాశంగా ప్రచారంలోకి తీసుకెళ్ళాలి. ఈ వ్యవస్థ మార్పుకొరకు పార్టీశ్రేణులు, కార్యకర్తలు పార్టీ పిలుపును ప్రజలలోకి శక్తివంతంగా తీసుకెళ్ళాల’ని కా॥అలోక్‌ముఖర్జీ పిలుపునిచ్చారు.

**సిపిఐ(ఎం.ఎల్) కేంద్రనాయకులు కామ్రేడ్ పి.జస్వంతరావు** మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టిన తీరు, ఆ సందర్భంగా వివిధ పాలకవర్గ పార్టీలు, ముఠాలు వారివారి ప్రయోజనాలకోసం ఏవిధంగా వ్యవహరించిందీ విశ్లేషించారు. ‘సమైక్యాంధ్ర బడ్జెట్‌లో నుండి కాంట్రాక్టుల ద్వారా అధికంగా కొల్లగొట్టుకోవాలని కొన్ని ముఠాలు సమైక్యాంధ్ర పేరుతో యాగీ చేయగా, ప్రత్యేక తెలంగాణా ఏర్పడితే తమకు దక్కబోయే వాటాలకోసం ఆ ప్రాంత కాంట్రాక్టర్ల ముఠాలు తెలంగాణా రాష్ట్రంపేరుతో పార్లమెంటు సాక్షిగా ముష్టియుద్ధాలకు పాల్పడ్డారు. ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేసి కేవలం 23 నిముషాల వ్యవధిలో ఈ బిల్లుకు ఆమోదం తెలిపామనటం వీరి రాజకీయ దివాళాకోరుతనానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్య బూటకత్వానికి ఓ చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. ఈ దేశ లేదా రాష్ట్ర ప్రజల వాస్తవికమైన అభివృద్ధి వీరికి గీటురాయి కానే కాదు. ప్రస్తుతం వేలకోట్ల రూపాయల ప్యాకేజీలు, పారిశ్రామికవేత్తలకు పన్ను రాయితీలతో ప్రజలకేదో ఒరగబెట్టినట్లుగా, సాధించిపెట్టినట్లుగా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ గందరగోళ పరిస్థితులను సృష్టించి, వీటి నడుమనుండే కేంద్రప్రభుత్వం ప్రజావ్యతిరేక, కేంద్రీకృత నిరంకుశ అధికారాలను తన చేతుల్లోకి తీసుకొంటోంది. నదీజలాల నీటి పంపకం సమస్యను కేంద్రం తన చేతుల్లోకి తీసుకుంది. ప్రపంచబ్యాంక్ ఆదేశాలకనుగుణంగా 12వ పంచవర్ష ప్రణాళికలో మరో 67 నగరాలను ఎంచుకొని అక్కడ కేంద్రీకరించాలని నిర్దేశించారు. ఫలితంగా హైదరాబాద్‌లోని పలు పరిశ్రమలను మూసివేసుకొని పరిశ్రమలను తుక్కుఇనుము క్రింద అమ్ముకొని వెళ్ళిపోయారు. వేలకోట్ల రూ॥లను ప్రజారోగ్యం పేరిట కార్పొరేట్లకు ప్రభుత్వం దోచిపెడ్తోంది. అదేవిధంగా ఫీజు రీఎంబర్స్ పేరున ప్రజాధనాన్ని కార్పొరేటు విద్యాసంస్థలకు కట్టబెడ్తోంది. ఆహారధాన్యాల ఉత్పత్తిని నిరుత్సాహపరుస్తూ ఆరోగ్య భద్రతకు చట్టాలు చేశామంటున్నారు. వీటన్నిటిని మరుగుపరిచేందుకు విభజన-సమైక్య వాదాలచుట్టూ సమస్యనంతా తిప్పి వాస్తవ సమస్యలను పెడదోవపట్టిస్తున్నారు. కనుక పాలకుల కుటిల విధానాలను అవగాహన చేసుకొని, దోపిడీ పాలకులపై సమరానికి సిద్ధంకావాలి. రానున్న ఎన్నికలలో ప్రతిభావంతంగా ఆ రాజకీయ కృషి సాగించాల’ని కా॥జస్వంతరావు పిలుపునిచ్చారు. సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కా॥భార్గవశ్రీ సభకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ సభను ముగించారు. సభలో అరుణోదయ కళాకారులు జనం పాటలను పాడారు. ✡

**Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010 and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2**

**Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010**